
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

కృష్ణా
జిల్లా వార్తలు

మంగళవారం 5 నవంబరు 2024





మోపిదేవిలో నాగుల చవితికి ముస్తాబైన సుబ్బారాయుడు

• శివమయం



నాగాయలంక పుష్కర ఘాట్‌లో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కార్తీకమాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి సోమవారం కావడంతో జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. కార్తీక దీపాలతో శోభాయమానంగా వెలిగాయి. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు పరమేశ్వరుడిని దర్శించి తరించారు.

నేడే నాగులచవితి

ముస్తాబైన మోపిదేవి సుబ్బారాయుడి ఆలయం

- చోడవరం పుట్ట వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

6



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్. చిత్రంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ

పారిశ్రామికాభివృద్ధికి కృషి

1,162 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్ రెండేళ్లలో పూర్తి

- మచిలీపట్నం పోర్టు, విమానాశ్రయ అభివృద్ధికి పెద్దపీట
- కడుపుమంట తట్టుకోలేకే వైసీపీ అనవసర ఆరోపణలు
- అధికారులతో సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్
- ఇంటింటికీ కుళాయిల పనులు పూర్తి చేయాలి : మంత్రి కొల్లు
- ప్రజాప్రతినిధులతో కలిసి అభివృద్ధి చేయాలి : ఎంపీ బాలశౌరి

6

• ప్రాణాలతో చెలగాటం..

దారి దోపిడీ

పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద రవాణా అధికారి నిర్వాకం

“ హైఫ్లాష్ టార్చిలైట్లతో ఒక్కసారిగా వాహనాలు, డ్రైవర్లపై వెలుతురు గుప్పిస్తారు. ఆ వెలుతురులో ఏమీ కనిపించక డ్రైవర్ సడెన్ బ్రేక్ వేస్తాడు. ఇంతలో డివైడర్‌పై నిలబడిన ప్రైవేట్ వ్యక్తులు ఒక్కసారిగా కిందకు దిగి వాహనం వద్దకు వచ్చేస్తారు. వాహనం తాళం, పత్రాలు తీసుకుని సార్.. దగ్గరకు రావాలంటూ డ్రైవర్‌ను గద్దిస్తారు. అన్నీ సక్రమంగా ఉన్నా సరే.. సార్‌ను కలవాల్సిందేనంటారు. సదరు సార్ వద్దకు వెళ్లాక అక్కడే ఓ పర్సనల్ వ్యక్తి చక్రం తిప్పుతాడు. ఫోన్‌లో ఏదో చూస్తాడు. ఏదేదో అయిపోయినట్టుగా బిల్డప్ ఇస్తాడు. డ్రైవర్లను బెంబేలెత్తిస్తాడు. ఆ తర్వాత వారి దగ్గర నుంచి డబ్బు గుంజుతాడు. వెంటనే ఆ వాహనానికి క్లీన్‌చిట్ వచ్చేస్తుంది. గుంజిన డబ్బును సొంతంగా జేబులో వేసుకుంటారు. పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద రోజూ రాత్రి 9 నుంచి అర్ధరాత్రి వరకు ఓ రవాణా అధికారి సాగించే దందా ఇది.

- రాత్రిపూట ప్రైవేట్ వ్యక్తులతో అనధికార వసూళ్లు
- డ్రైవర్లపై ఒక్కసారిగా టార్చిలైట్ల వెలుతురు
- సడెన్ బ్రేకులు వేస్తుండటంతో ప్రమాదాలు
- ఇటీవల లారీని మినీవ్యాన్ ఢీకొని ఒకరి మృతి
- అయినా ఆగని అధికారి అరాచకాలు
- ఫిర్యాదులు అందుతున్నా పట్టని ఉన్నతాధికారులు



పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద రవాణా అధికారి కారులో ఉండగా, బయట ప్రైవేట్ వ్యక్తుల వసూళ్లు



గతనెల 29న జరిగిన ప్రమాదం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఓ రవాణా అధికారి ఆధ్వర్యంలో పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద అనధికార వసూళ్లు చేపడుతున్నారు. రోజూ రాత్రి 9 గంటలైతే చాలు.. ప్లాజా వద్ద గద్దల్లా వాలిపోతున్నారు. జాతీయ రహదారిపై ఉన్నామన్న స్పృహ కూడా లేకుండా ఎడాపెడా వాహనాలను నిలిపేస్తున్నారు. టార్చిలైట్లు పట్టుకుని ఉండే ప్రైవేట్ వ్యక్తులు.. డ్రైవర్లపై వెలుతురు ఫోకస్ వేయించి సడెన్ బ్రేకులు వేయిస్తున్నారు. ఇలా చేయడం వల్ల వారం కిందట ఓ లారీ వెనుకగా వస్తున్న మినీవ్యాన్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. సదరు లారీ డ్రైవర్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో ఈ విషయాన్నే చెప్పాడు.

ప్రైవేట్ వ్యక్తులతో వసూళ్లు

రవాణా శాఖలోని మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ల ప్రధాన విధి వాహనాలను తనిఖీ చేయటం. ఎవరి పరిధిలో వారు డ్రైవ్స్ నిర్వహిస్తూ ఈ తనిఖీలు నిర్వహించాలి. మచిలీపట్నం పరిధి కలిగిన ఓ రవాణా ఇన్‌స్పెక్టర్ మాత్రం రెండు నెలలుగా పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద రాత్రిపూట వాహనాలు చెక్ చేస్తున్నారు. రోజూ ఒక ప్రాంతంలో తనిఖీలు చేసే వీల్లేదు. కానీ, సదరు ఇన్‌స్పెక్టర్ రెండు నెలలుగా పొట్టిపాడును పట్టుకుని వదలట్లేదు. ఇన్‌స్పెక్టర్, హోంగార్డులే కాకుండా.. ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని ఇక్కడ వాహనాలు ఆపుతున్నారు. ఈ వాహనాల డ్రైవర్లు మొదట సదరు ఇన్‌స్పెక్టర్ పర్సనల్ వ్యక్తిని కలవాలి. చదువు రాని మిగతా 6లో..



విజయవాడ వెస్ట్ బైపాస్..

టార్గెట్ జనవరి

చకచకా సాగుతున్న పనులు

- హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమస్యలు కొలిక్కి..
- బ్యాలెన్స్ పనులు చేపడుతున్న కాంట్రాక్టు సంస్థ
- ప్యాకేజీ-1, 2 పనులు ఇప్పటికే పూర్తి
- ప్యాకేజీ-3 పనులు వేగవంతం
- మరో ఆరు నెలల్లో ప్యాకేజీ-4 కూడా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : చినఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు చేపడుతున్న విజయవాడ పశ్చిమ బైపాస్ పనులు జనవరికి పూర్తిచేసి, ప్రారంభించేందుకు జాతీయ రహదారుల సంస్థ రంగం సిద్ధం చేస్తోంది. విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ-1లో ఎన్‌హెచ్-16పై గుండుగొలను నుంచి కలపర్రు వరకు ఆరు వరసల విస్తరణ పనులు ఇటీవలే ప్రారంభించారు. ప్యాకేజీ-2లో భాగంగా కలపర్రు నుంచి చినఅవుటపల్లి వరకు ఆరు వరసల విస్తరణతో పాటు ఆరు కిలోమీటర్ల హనుమాన్ జంక్షన్ బైపాస్ రోడ్డు ఇంతకుముందే అందుబాటులోకి వచ్చాయి. తాజాగా ప్యాకేజీ-3లో చినఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ఈ రోడ్డు అందుబాటులోకి రానుంది. ప్యాకేజీ-4లో కృష్ణానదిపై 3 కిలోమీటర్ల వంతెన మిగతా 6లో..

ఉపాధ్యాయుడే కీచకుడు

ఏడేళ్ల పాప తొడ కొరికిన కామాంధుడు

- కొద్దిరోజులుగా అసభ్యకర ప్రవర్తన
- కోడూరు పీఎస్‌లో తల్లిదండ్రుల ఫిర్యాదు

కోడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన ఉపాధ్యాయుడే కామాంధుడిగా మారిన ఉదంతమిది. మూడో తరగతి చదువుతున్న ఏడేళ్ల పాప తొడపై కొరికిన ఘటన కోడూరు శివారు నరసింహాపురం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో చోటుచేసుకుంది. సోమవారం మధ్యాహ్న సమయంలో ఉపాధ్యాయుడు కటికల వేణుగోపాలరావు.. పాపను బెంచీపై కూర్చోబెట్టి డ్రస్‌పైకి లేపి తొడపై కొరికాడని, పాప ఏడ్వగా, విషయం ఎవరికైనా చెబితే కొడతానని, చంపేస్తానని బెదిరించాడని పాప తండ్రి తెలిపారు. సాయంత్రం ఇంటికి రాగా, స్నానం చేయించే సమయంలో తొడపై ఉన్న ఘాటు చూసిన తల్లి ప్రశ్నించగా, పాప విషయం చెప్పిందని పేర్కొన్నారు. కొన్ని రోజులుగా పాప పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తెలిపారు. అనంతరం కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పాప మీడియాతో మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, ఎవరితోనైనా చెబితే కొడతానని, చంపుతానని బెదిరిస్తున్నాడని తెలిపింది. పాఠశాలలో పదిమంది విద్యార్థులే ఉన్నారని, వారిలో ఐదుగురే పాఠశాలకు వస్తారని, వేరొక టీచర్‌తో పాఠాలు చెప్పిస్తూ, ఈయన మాత్రం పాఠశాల ఆవరణలో మంచం వేసుకుని కాలక్షేపం చేస్తుంటాడని పాప తల్లిదండ్రులు ఆరోపించారు. ఇంటికి వచ్చిన తమ కుమార్తె పాఠశాలకు వెళ్లనని, అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని చంపేయమని ఏడ్చిందన్నారు. ఇలాంటి కామాంధ ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విషయాన్ని ఎంతవో దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక దందాలో కహానీ

• వరుస సోదాలతో ఇసుకాసురులు ఉక్కిరిబిక్కిరి

8లో

మారని బామ్మర్ది

మైలవరంలో ప్రజాప్రతినిధి బామ్మర్ది దోపిడీ

నిన్నటి వరకు వైసీపీ ముసుగులో అక్రమాలు

- నేడు టీడీపీ జెండా పట్టుకుని వైసీపీ వారికి సహకారం
- అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు
- ఇష్టానుసారంగా లారీల నుంచి మామూళ్లు
- మద్యం దుకాణాల్లోనూ వైసీపీ వారికే అండ
- మైలవరం నియోజకవర్గంలో రగిలిపోతున్న తమ్ముళ్లు



మైలవరం నియోజకవర్గ అధికార పార్టీలో ప్రజాప్రతినిధి బామ్మర్ది తీరు చిచ్చురేపుతోంది. గ్రావెల్ తవ్వకాలు, మద్యం దుకాణాల విషయంలో వైసీపీ నాయకులకు లబ్ధి చేకూర్చేలా ఆయన వ్యవహరిస్తున్నారని స్థానిక టీడీపీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : మైలవరం మండలం వెదురుబీడెంలో ఓ వైసీపీ నాయకుడు 3 ఎకరాల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు తెచ్చుకున్నారు. విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు పనులకు ఆయన గ్రావెల్ తరలిస్తున్నారు. ఇందులో ఇద్దరు వైసీపీ నాయకులు వాటాదారులు. అయితే, క్వారీ నుంచి గ్రావెల్ తీసుకెళ్లే లారీల విషయంలో ఇటీవల పెద్ద గొడవే జరిగింది. బైపాస్ నిర్మాణ పనులకు గ్రావెల్ తోలే కాంట్రాక్టును అధికార పార్టీ ప్రజాప్రతినిధి బామ్మర్ది దక్కించుకున్నారు. దీన్ని సాకుగా చూపుతూ ఇతరులెవరూ వెదురుబీడెం క్వారీ నుంచి గ్రావెల్ తరలించడానికి వీల్లేదంటూ ఆంక్షలు విధించారు.

టీడీపీ నాయకులకు ఆటంకాలు

బైపాస్ పనులకు గ్రావెల్ తరలించుకునేందుకు కొద్దిరోజుల క్రితం ఓ టీడీపీ సానుభూతిపరుడికి అనుమతి లభించింది. ఆ వ్యక్తి వెదురుబీడెం క్వారీ నుంచి గ్రావెల్ తోలేందుకు సిద్ధమయ్యారు. దీనికి బామ్మర్ది అడ్డు పడ్డారు. ఈ క్వారీ నుంచి కాకుండా వేరే చోట నుంచి గ్రావెల్ తరలించుకోవాలని ఆదేశించారు. ఒకవేళ వెదురుబీడెం నుంచే గ్రావెల్ తోలాలంటే లారీకి రూ.2 వేలు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. బైపాస్ నిర్మాణ కంపెనీ నుంచి తానే బిల్లులు వసూలు చేసుకుని, తనకు రావాల్సిన మొత్తం మినహాయించుకున్న తర్వాతే మిగిలిన మొత్తం ఇస్తానని షరతు విధించారు. దీంతో కంగుతిన్న ఆ లారీల యజమాని తానూ టీడీపీ కోసం పనిచేసిన వ్యక్తినేనని, ఐదేళ్లలో చాలా నష్టపోయానని మొరపెట్టుకున్నా బామ్మర్ది ససేమిరా.. అన్నారు. చివరికి చేసేది లేక షరతులకు అంగీకరించి గ్రావెల్ తోలడం ప్రారంభించారు. రోజులు గడుస్తున్నా తనకు రావాల్సిన మొత్తాన్ని ఇవ్వకుండా నాన్చుతుండటంతో ఇదే విషయాన్ని బామ్మర్ది వద్ద ప్రస్తావించారు. గ్రావెల్ తోలకంలో తనకు గిట్టుబాటు కావడం లేదని, తనకు రూ.40 లక్షలు రావాలని, తన డబ్బు తనకు ఇప్పిస్తే వెళ్లిపోతానని కోరారు. రోజులు గడుస్తున్నా డబ్బు మాత్రం ఇవ్వకుండా తిప్పుకొంటున్నారని ఆ లారీల యజమాని తనకు తెలిసిన వారి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఇదంతా ఒక ఎత్తయితే నిబంధనలకు విరుద్ధంగా వెదురుబీడెం క్వారీలో సుమారు 20 అడుగుల మేర గ్రావెల్ తవ్వకాలు జరుపుతుండటం మరో ఎత్తు. దీనిపై స్థానికులు కొందరు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా బామ్మర్ది ఒత్తిడితో వారు అటువైపే చూడటం మానేశారు.

మద్యం దుకాణాల్లోనూ వైసీపీవారే..

ఇబ్రహీంపట్నంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్, వైసీపీ నాయకుడైన వ్యక్తికి మద్యం దుకాణం దక్కింది. ఇతని నుంచి నియోజకవర్గ టీడీపీ నాయకులు కొందరు దుకాణం కొనుగోలు చేసేందుకు బేరాలు మొదలుపెట్టారు. ఈలోగా బామ్మర్ది ప్రవేశించి ఎవరికీ అమ్మాల్సిన అవసరం లేదని, తాను చెప్పిన వారికి 30 శాతం వాటా ఉచితంగా ఇస్తే నిర్విఘ్నంగా వ్యాపారం చేసుకోవచ్చని సదరు వైసీపీ నేతకు అభయమిచ్చారు. దీంతో తాను దుకాణం అమ్మే ప్రశ్నే లేదంటూ వైసీపీ నాయకుడు అడ్డం తిరిగారు. పుల్లూరులో మద్యం దుకాణం దక్కించుకున్న తెలంగాణ వ్యాపారి నుంచి తక్కువ ధరకు కొని వైసీపీ నాయకులకు అప్పగించడంలో బామ్మర్ది ప్రధాన పాత్ర పోషించారు. మిగతా 6లో..

మీకోసం అర్జీలను సత్వరమే పరిష్కరించండి

- అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

6లో



8లో

మహోన్నత దాతలు

• భవానీలు, అయ్యప్పల సేవలో పుట్టగుంట, అడపా బ్రదర్స్

పెసలు కొనేదెప్పుడు?

- పది రోజుల కిందట మార్క్‌ఫెడ్ అధికారులకు శాంపిల్స్
- నేటికీ కొనుగోలు కేంద్రాల ఊసేలేదు
- రబీ సాగుకు సొమ్ముల్లేక రైతుల అవస్థలు

పెసలు సాగు చేసిన రైతులు అమ్ముకోవడానికి అవకాశం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ నుంచి రైతులకు విముక్తి కల్పించి పెసలకు మద్దతు ధర అందించాల్సిన మార్క్‌ఫెడ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పది రోజుల కిందట స్థానిక అధికారులు శాంపిల్స్ సేకరించి పంపించినా నేటి వరకు కొనుగోలు కేంద్రాల ఊసే లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రబీ పంట సాగుకు చేతిలో చిల్లిగవ్వలేదని వాపోతున్నారు.



(ఆంధ్రజ్యోతి - కంచికచర్ల): బహిరంగ మార్కెట్లో పెసలకు క్వింటాకు రూ. 6 వేల నుంచి గరిష్ఠంగా రూ. 7 వేల లోపు ధర లభిస్తుంది. కంచికచర్ల ప్రాంతంలో వర్షానికి ముందు ఇళ్లకు చేరిన పెసలు నాణ్యతా పరంగా చాలా బాగున్నాయి. అయితే వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారు. రబీ సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభమైనందున పెట్టుబడులు కోసం రైతులు తప్పనిసరిగా పెసలు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8,558. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు లేకపోవటం వల్ల రైతులకు మద్దతు ధర లభించటం లేదు.

'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందించిన ఎమ్మెల్యే

రైతులకు జరుగుతున్న నష్టాన్ని గురించి పక్షం రోజుల కిందట 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పందించారు. మార్క్‌ఫెడ్ అధికారులకు ఫోన్ చేసి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులకు మద్దతు ధర అందించి ఆదుకోవాల్సిందిగా కోరారు. దీనిపై మార్క్‌ఫెడ్ అధికారులు స్థానిక వ్యవసాయ మార్కెట్ అధికారులకు ఫోన్ చేసి పెసలు శాంపిల్స్ పంపించమని అడిగారు. రైతుల నుంచి దాదాపుగా వంద శాంపిల్స్ సేకరించి ఏఎంసీ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులకు పంపించారు. శాంపిల్స్ పంపించి పది రోజులు కావస్తున్నప్పటికీ మార్క్‌ఫెడ్ అధికారుల నుంచి ఏలాంటి సమాధానం లేదు. పెసలు కొనే విషయమై ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఈలోగా తమకు నష్టం జరుగుతుందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. స్వయంగా ఎమ్మెల్యే సౌమ్య ఫోన్ చేసినప్పటికీ మార్క్‌ఫెడ్ అధికారులు పెద్దగా స్పందించటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు పెసలు అమ్మిన పక్షంలో క్వింటాకు రూ. 1500 నుంచి రూ. 2 వేల వరకు నష్టం కలుగుతుందని అంటున్నారు. మద్దతు ధర అక్టోబరు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చినందున పెసలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటంలో మార్క్‌ఫెడ్ అధికారులు ఎందుకు అలసత్వం చూపుతున్నారో అర్థం కావటం లేదని రైతులు అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు జోక్యం చేసుకుని, కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.


నష్టపోయిన పెసర రైతులను ఆదుకోవాలి



ఈ ఏడాది పెసర రైతులు భారీ వర్షాలు, వరదల ఎంతో నష్ట పోయారు. ప్రభుత్వ సాయం కూడా పెద్దగా అందలేదు. దిగుబడులు ఆశాజనకంగా లేవు. వర్షాలకు ముందు తడవకుండ ఇళ్లకు వచ్చిన పెసలకు సైతం గిట్టుబాటు ధర లభించటం లేదు. రబీ సీజన్ ప్రారంభమైనం దున పెట్టుబడులకు సొమ్ముల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు స్పందించి పెసర రైతులను తక్షణమే ఆదుకోవాలి.

-జాలిపర్తి సాంబశివరావు, కంచికచర్ల

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి. బహిరంగ మార్కెట్లో వ్యాపారులు తక్కువ ధరకు కొంటూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. మద్దతు ధరతో పోల్చితే క్వింటాకు రూ. 2 వేలకు పైగా నష్ట పోతున్నారు. శాంపిల్స్ చూసిన తర్వాత కూడా మార్క్‌ఫెడ్ అధికారులు స్పందించక పోవటం దారుణం. రైతుల దుస్థితిని అర్థం చేసుకుని కొనుగోలు చేయాలి.

-నన్నపనేని లక్ష్మీనారాయణ, కంచికచర్ల

మీకోసం అర్జీలను సత్వరమే పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం, నవంబ రు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశపుహాలులో సోమవారం జేసీ గీతాంజలి శర్మ, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, ఆర్డీవో కె.స్వాతితో కలసి ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోర్టు ధిక్కరణ కేసులపై సత్వరమే వకాలత్‌లు సమర్పించాలన్నారు. నీటి పారుదలశాఖలో కోర్టు కేసులు అధికంగా ఉన్నాయని, వాటికి సరైన సమాధానం చెప్పకపోతే ఎలాగని ఆ శాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన మీకోసం అర్జీలను అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులకు పంపిన అర్జీలను పూర్తిగా పరిశీలించి సమస్య పరిస్కారమైనదీ లేనిది తనకు నివేదిక రూపంలో అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ శివప్రసాద్, డీపీవో జె.అరుణ, డీఎస్‌వో వి.పార్వతి, డీఎంఅండ్‌హెచ్‌వో గీతాభాయి పాల్గొన్నారు.

మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ

ఇన్‌చార్జి మంత్రి హోదాలో తొలిసారిగా జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కలెక్టర్ బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద సోమవారం స్వాగతం పలికారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై వారు మంత్రితో చర్చించారు.

వైభవంగా కార్తీక మాసోత్సవాలు ప్రారంభం



కార్తీకమాస పూజల్లో ఈవో రామారావు

వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంద్ర కీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్తీక తొలి సోమ వారం సందర్భంగా మల్లేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి ఏడు గంటల వరకు అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో రామారావు, స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకులు శ్రీనివాస శాస్త్రి పాల్గొన్నారు. మంగళవారం నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు ఆలయంలో కార్తీక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో రామారావు తెలిపారు. నాగుల చవితి సందర్భంగా మంగళవారం ఉపాలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేక కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కార్తీక మాసం సందర్భంగా మల్లేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకదశ రుద్రాభిషేకాలు, సహస్రలింగార్చన ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జరుగుతాయని, రూ.500 రుసుము చెల్లించి భక్తులు పాల్గొనవచ్చునని తెలిపారు. సోమవారం, ఏకాదశి, పౌర్ణమి, మాసశివరాత్రి రోజుల్లో బిల్వార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రాభిషేకాలు మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 వరకు జరుగుతాయని, రూ.2,000 రుసుము చెల్లించి భక్తులు పాల్గొనవచ్చునని వివరించారు. ప్రతిరోజూ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అన్ని విఐపీల దర్శనాలు నిలుపుచేయటమైందని, సాధారణ భక్తులకు మెరుగైన సేవలు అందించటానికి దేవస్థానం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

దుర్గమ్మ సేవలో తెలంగాణ మంత్రి పొన్నం

వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీ లాద్రిపై కనక దుర్గమ్మను తెలం గాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సోమ వారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో కె.ఎస్. రామారావు మంత్రికి సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం పొన్నం ప్రభా కర్‌కు అమ్మవారి చిత్రపటం అంద జేశారు. మంత్రి వెంట కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు ఉన్నారు.

కరాటే పోటీల్లో శ్రీవిశ్వశాంతి విద్యార్థుల ప్రతిభ



విజేతలతో శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల అధినేత మాదల సుబ్రమణ్యేశ్వరరావు

ఉయ్యూరు, నవం బరు 4 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పటమటలో చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జేకే గోజు రి యూ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 23 నేషనల్ లెవల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నారు. అండర్-14 విభాగం సీహెచ్ లలిత్‌నాగసాయి కుమితే విభాగంలో ప్రథమస్థానం, కటా విభాగంలో తృతీయ స్థానం, అండర్ -17 విభాగంలో మిలన్‌కుమార్ ప్రథమ స్థానం, అండర్ -17 బాలికల విభాగంలో తాన్యా ఆస్థా ప్రథమస్థానం సాధించారు. బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను, కరాటే కోచ్ పి.రామకృష్ణను విద్యా సంస్థల అధినేత మాదల సుబ్రమణ్యేశ్వరరావు, ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్లు మాదల సూర్యశేఖర్, సుష్మా అభినందించారు.

లంకపల్లి రీచ్‌లో ముఠా కార్మికుల మధ్య వివాదం

పమిడిముక్కల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : లంకపల్లి ఇసుకరీచ్‌లో లోడింగ్ విషయమై లంకపల్లి, ఐనపూరు గ్రామాల ముఠా కార్మికుల మధ్య వివాదం పోలీసులు, తహసీల్దార్ జోక్య వరకు దారితీసింది. లంపల్లి రీచ్‌లో అదే గ్రామానికి చెందిన కార్మికులు వాహనాల్లో ఇసుక లోడింగ్ చేస్తుండగా, పక్కగ్రామమైన ఐనపూరుకు చెందిన కార్మికులు కూడా లంకపల్లి రీచ్‌లో లోడింగ్ చేసేందుకు వెళ్లగా మా గ్రామ పరిధి రీచ్‌లో మేమే లోడింగ్ చేస్తాము మీరు లోడింగ్ చేయడానికి వీల్లేదని లంకపల్లి గ్రామస్థులు అడ్డుకున్నారు. దీంతో ఐనపూరు గ్రామస్తులు పోలీసులు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ నవీన్‌కుమార్ , సీఐ చిట్టిబాబు సోమవారం ఇరువర్గాలను పిలిచి మాట్లాడినప్పటికీ రాజీ కుదరక పోవడంతో సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించినట్టు సమాచారం.

నాగుల చవితికి మోపిదేవి ముస్తాబు

మోపిదేవి, నవం బరు 4 (ఆంధ్ర జ్యోతి): నాగుల చవితి పర్వదిన వేడుకలకు మోపిదేవిలోని శ్రీసుబ్ర హ్మ ణ్యేశ్వర స్వామి వారి దేవ స్థానం ముస్తా బైంది. లక్ష మందికిపైగా భక్తులు వస్తారనే అంచ నాలతో దేవ స్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున నాగపుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు పుట్టలో పాలుపోసి చవితి వేడుకలు ప్రారంభిస్తారు. అనంతరం భక్తులకు నాగపుట్ట, స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. చవితి వేడుకలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణం, ఆలయాన్ని విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు.

130 మంది పోలీసులతో బందోబస్తు

మోపిదేవి ఆలయం వద్ద 130 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. మోపిదేవి అవుట్ పోస్టు నందు సిబ్బందికి విధులు కేటాయింపుపై పలు సూచనలు చేశారు. మోపిదేవిలో ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా ఆర్టీసీ బస్సులను జాతీయ రహదారి వెంబడి మళ్లించటం జరిగిందన్నారు. సీఐలు యువకుమార్, ఈశ్వరరావు, మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో జీఎన్‌ఎం ఉద్యోగానికి దరఖాస్తులు

మచిలీపట్నం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సును పూర్తిచేసిన వారు జర్మనీలో ఉద్యోగం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి నరేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్ఎస్‌డీసీ, ఓఎంసీఏపీ సంయుక్త సహకారంతో జర్మన్ భాష నేర్చుకునేందుకు శిక్షణ ఇవ్వడంతోపాటు, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. 35 సంవత్సరాలలోపు వయసు ఉండి, జర్మనీ దేశంలో ఉద్యోగం చేసేందుకు సిద్ధంగా ఉన్న వారికి, వీసా ఇప్పించడంతోపాటు, విమాన చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. జర్మనీలో ఉద్యోగం చేసే వారికి నెలకు భారత కరెన్సీ లెక్కల ప్రకారం రూ.2.33లక్షల నుంచి 3.26 లక్షల వరకు జీతంగా లభిస్తుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 11 నుంచి గుంటూరులో శిక్షణ ప్రారంభమ వుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు 94404 44033 నంబరును సంప్రదించాలని కోరారు.

జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి కృషి

- ఏపీఐఐసీ ద్వారా 1,162 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి
- మచిలీపట్నం పోర్టు, విమానాశ్రయం ఆధునికీకరణపై ప్రత్యేక దృష్టి
- వైసీపీ కడుపుమంట ఆపుకోలేక అనవసర ఆరోపణలు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్



జిల్లా సమీక్షా సమావేశానికి హాజరైన అధికారులు

మచిలీపట్నం, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాను రానున్న రోజుల్లో పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. జిల్లాపరిషత్ సమావేశపు హాలులో సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్వాకం కారణంగా జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోనప్పటికీ ముందుచూపుతో వ్యవహరించే ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూనే, మరోవైపు పారిశ్రామికంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు మంచి ప్రణాళికను రూపొందించారన్నారు. ఈ నేపథ్యంలో ఏపీఐఐసీ ద్వారా కృష్ణాజిల్లాలో 1,162 ఎకరాల్లో పారిశ్రామిక కారిడార్‌ను రెండేళ్లలో పూర్తిచేస్తామన్నారు. జిల్లాలో ఇండస్ట్రియల్ కారిడార్‌లు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. మచిలీపట్నం పోర్టు, గిలకలదిండి ఫిషింగ్ హార్బర్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గన్నవరం విమానాశ్రయాన్ని ఆధునిక వసతులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో 45 రహదారులను 239 కిలోమీటర్ల మేర రూ.14.76 కోట్ల వ్యయంతో డిసెంబరు నాటికి అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. సంక్రాంతి నాటికి రహదారులపై ఉన్న గుంతలన్నింటినీ పూడ్చివేస్తామన్నారు. అధికారం కోల్పోయిన వైసీపీ నాయకులు కడుపుమంటతో అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు

జల్‌జీవన్ మిషన్ పనులపై దృష్టి సారించాలి: మంత్రి కొల్లు

జిల్లాలో ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా తాగునీరు అందించే జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం పోర్టు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రానున్న ఐదేళ్లలో జిల్లాలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికలను అధికారులు తయారుచేస్తే ప్రాధాన్యతాక్రమంలో పనులను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేయడం జరుగుతుందన్నారు.

ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని అభివృద్ధి పనులు చేయాలి : ఎంపీ బాలశౌరి

మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ నీటిపారుదలశాఖ, డ్రెయినేజీ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ విభాగాల అధికారులు స్థానిక శాసనసభ్యులతో సమన్వయం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాలలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రణాళికలు తయారు చేసి, అభివృద్ధి పనులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీకి సూచించారు, అభివృద్ధి పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిధులను కూడా జతచేయాలని, అవసరమైతే నాబార్డు నుంచి నిధులను తాను తీసుకువస్తానని చెప్పారు. జిల్లాలో పంట కాలువలు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందుల తలెత్తకుండా జిల్లాను యూనిట్‌గా తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కృష్ణానదికి 12లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకునేలా కరకట్టను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ బాలాజీ వివిధ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని పవర్‌పాయింట్ ప్రజంటేషన ద్వారా వివరించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, ఉపాధి హామీ పథకం, నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, మచిలీపట్నంపోర్టు, గిలకలదిండి ఫిషింగ్ హార్బర్, తదితర విభాగాలపై ఇన్‌చార్జి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, కాగిత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజా, జేసీ గీతాంజలి శర్మ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ ఓపెన్ కాకముందే వైసీపీ నేతల్లో కంగారు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి



మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అవినీతి, అక్రమాల్లో కూరుకు పోయిన వైసీపీ నాయకులు రెడ్‌బుక్ ఓపెన్ చేయక ముందే కంగారు పడుతున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. భవన నిర్మాణ కార్మికులు దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. ఇసుకను ఉచితంగా ఇవ్వడం వల్ల మళ్లీ భవన నిర్మాణ కార్మికుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజక వర్గాల్లో మోడల్ ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమాలపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధించారని గుర్తు చేశారు. అందుకే ప్రజలు ఎన్నికల్లో జగన్‌రెడ్డికి 11 సీట్లు ఇచ్చి తగిన గుణపాఠం చెప్పారన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పాల్గొన్నారు. కాగా, కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉంటున్న బీజేపీ నాయకులకు నామినేటెడ్ పోస్టుల్లో సముచిత స్థానం కల్పించాలని ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు బీజేపీ నేతలు గుతికొండ రాజాబాబు, సోడిశెట్టి బాలాజీ, పంతం గజేంద్ర వినతిపత్రం సమర్పించారు.

'దుర్గాగణేష్' అధినేత గణేష్‌బాబు ఆత్మహత్య బాధాకరం

నాపై ఆరోపణలు అవాస్తవం

సోనోవిజన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కరమూర్తి



వన్‌టౌన్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని దుర్గాగణేష్ మార్కెటింగ్ అధినేత గణేష్‌బాబు ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని సోనోవిజన్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కరమూర్తి అన్నారు. గణేష్ బాబు నాపై వీడియో ద్వారా చేసిన ఆరోపణలు అవాస్తమని భాస్కరమూర్తి తెలిపారు. సోమవారం ఏలూరు రోడ్డులోని విజయ ప్లాజాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం ద్వారకానగర్ డైమండ్ పార్క్ వద్ద జిప్లస్ త్రీ బిల్డింగ్‌లో తాను 2018లో సోనోవిజన్ షోరూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. అదే బిల్డింగ్‌లో దుర్గాగణేష్ మార్కెటింగ్ అధినేత గణేష్ బాబు కూడా షోరూమ్‌ను అద్దెకు తీసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నారన్నారు. తాను బిల్డింగ్ యజమాని రూపావతి వద్ద అద్దెకు తీసుకుని అడ్వాన్స్‌గా రూ.90 లక్షలు, నెలకు రూ.9లక్షలు అద్దె చెల్లించే విధంగా అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిపారు. గణేష్ బాబు వ్యాపారం, తన వ్యాపారం ఒకటే కావటం వలన వ్యాపారంలో పోటీ ఉండటంతో తాను గణేష్ వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నట్లుగా ప్రచారం చేయటం అవాస్తవమన్నారు. తాను వ్యాపార నిమిత్తం విశాఖపట్నం నెలలో రెండుసార్లు వెళ్లి వస్తానని, ఏనాడు గణేష్ బాబును కలిసి మాట్లాడలేదని చెప్పారు. రూపావతి బిల్డింగ్‌ను తాను కొనుగోలు చేయటానికి ఆమె పై ఒత్తిడి చేస్తున్నట్లు గణేష్ బాబు వీడియో ద్వారా ఆరోపించటం అవాస్తవమన్నారు. బిల్డిం గ్ యజమాని, తాను నిబంధనల ప్రకారమే వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రెండు షోరూమ్‌లు పక్క పక్కనే ఉండటం వలన వాహనాల పార్కింగ్ విష యంలో తన షోరూమ్‌కు వచ్చే కస్టమర్ల వాహనాల పార్కింగ్ సమస్య ఉండటంతో ఆ సమస్యను రూపావతి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. తాను ఢిల్లీలో జరిగిన బజాజ్ ఫైనాన్స్ సమావేశానికి వెళ్లినప్పుడు గణేష్ బాబును కులం పేరుతో దూషించానని ప్రచారం చేయటం చాలా బాధాకరమని, తాను గణేష్ బాబును కులం పేరుతో దూషించలేదన్నారు. తన వద్ద పనిచేసే 80 మంది మేనేజర్లలో 40 మంది మేనేజర్లు గణేష్ బాబు సామాజిక వర్గానికి చెందిన వారని, 20 శాతం ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారని, మిగిలిన వారు బీసీ, ముస్లిం వర్గాలకు చెందిన వారని చెప్పారు. తన సామాజిక వర్గానికి చెందిన వారు కేవలం ఇద్దరు మేనేజర్లు మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. వ్యాపారంలో కుల ప్రస్తావన తేవటం బాధాకరమన్నారు. గణేష్ బాబు కిందస్థాయి నుంచి కష్టపడి సుమారు 10 షోరూమ్‌లు ప్రారంభించారని, అదేవిధంగా తాను కూడా కిందిస్థాయి నుంచే వచ్చానని తెలిపారు. తన షోరూమ్ పక్కన ఉన్న గణేష్ షోరూమ్‌ను ఖాళీ చేయించటానికి తాను ప్రయత్నించాననటం అపోహ మాత్రమేనని తెలిపారు. వ్యాపారంలో నష్టాలు, లాభాలు వస్తుంటాయని, తాను కూడా కొన్ని సందర్భాలలో భారీగా నష్టపోయానని, అయినా సరే ధైర్యంగా నిలబడి వ్యాపారం చేస్తున్నానని వివరించారు. తాను ఏరోజు కంపెనీ ముఖ్య ప్రతినిధులతో ఇతర వ్యాపారస్తుల గురించి మాట్లాడలేదని, కేవలం తన వ్యాపారం గురించే మాట్లాడుతున్నామని తెలిపారు. గణేష్ ఆత్మహత్య చేసుకోవటం చాలా బాధాకరమని, అతని ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.

దారి దోపిడీ

(5వ పేజీ తరువాయి)

డ్రైవర్లయితే వీరంతా తెగ భయపెట్టేస్తారు. ఫోన్‌లో చూస్తూ కంగారు పెట్టించేస్తారు. దీంతో డ్రైవర్లు వాహనంలో ఏ తప్పు ఉందో తెలియక అడిగినంత ఇచ్చుకునేందుకు సిద్ధపడిపోతారు. ఈ అధికారిపై పలువురు వాహనదారులు రవాణా శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

పక్కాగా ఆపరేషన్

సదరు అధికారి.. జాతీయ రహదారి పక్కనే కారులో కూర్చుని ఉంటారు. ఈ సార్ డ్రైవర్ అక్కడున్న ప్రైవేట్ సిబ్బందికి నాయకత్వం వహిస్తాడు. ఎవరు ఎక్కడ ఉండాలి? ఎవరు ఎలాంటి వాహనాలను ఆపాలి? అనేది ముందే నిర్ణయించుకుంటారు. డ్రైవర్లను పిలుచుకుని వచ్చేది కూడా అతనే. ఫోన్‌లో చూస్తూ కంగారు పెట్టించేదీ అతనే. ఇలా భారీస్థాయిలో వసూళ్లు చేపడుతున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ.. డబ్బు అంతటినీ సొంత జేబుల్లో వేసుకుంటున్నారు.

ఉన్నతాధికారులు ఏం చేస్తున్నట్టు..?

జాతీయ రహదారిపై బహిరంగంగా ప్రైవేట్ వ్యక్తులు వాహనాలను ఆపుతున్నా, వీటికి సంబంధించి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవట్లేదు. ప్రమాదాలు లేని ప్రయాణాల కోసం రవాణా శాఖ 'సఫర్' వంటి కార్యక్రమాలను నిర్వహిస్తుంటే, అదే సంస్థ సిబ్బంది ప్రజల ప్రాణాలు తీసేలా ప్రవర్తించడం ఎంతవరకు సబబు అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాసుల కక్కుర్తి కోసం అమాయకుల ప్రాణాలను బలి తీసుకోవడం సరికాదని, అనధికార వసూళ్లపై ఉప రవాణా కమిషనర్ దృష్టిసారించి చర్యలు తీసుకోవాల్సి అవసరముంది.

విజయవాడ వెస్ట్ బైపాస్.. టార్గెట్ జనవరి

(5వ పేజీ తరువాయి)

పనులు, వెంకటాయపాలెం నుంచి కాజా వరకు ఆరు వరసల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. ప్యాకేజీ-4 పనులు అందుబాటులోకి రావటానికి మరో ఆరు నెలలు పట్టే అవకాశముంది. ప్యాకేజీ-3 పనులు 95 శాతం పైగా పూర్తయ్యాయి.

వేగంగా పనులు

విద్యుత్ హైటెన్షన్ లైన్ల కారణంగా ఆరుచోట్ల సమస్యలు తలెత్తాయి. రెండుచోట్ల వెహికల్ అండర్ పాస్‌లు, ఒకచోట ఆర్‌వోబీ నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మరోచోట కొద్దిగా అప్రోచ్ బిట్ మాత్రమే మిగిలి ఉంది. హైటెన్షన్ విద్యుత్ లైన్ల సమస్యలు కొలిక్కి రావటంతో కాంట్రాక్టు సంస్థ మేఘా కూడా పనుల్లో వేగాన్ని పెంచింది. నున్నకు దిగువన పాతపాడు దగ్గర విద్యుత్ లైన్ల మార్పిడి జరిగింది. పాత టవర్లను తొలగించి ఎత్తయిన టవర్లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో రెండు వెహికల్ అండర్ పాస్‌ల బ్యాలెన్స్ పనులు చేపట్టారు. అలాగే, నున్న పవర్‌గ్రిడ్ దగ్గర కూడా ఆర్‌వోబీ పనులు ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నారు. గొల్లపూడి ఆర్‌వోబీ ప్రారంభ మార్గంలో అప్రోచ్ దగ్గర విద్యుత్ లైన్లను మార్చాల్సి ఉంది. అలాగే, పాతపాడు ఎగువన కూడా విద్యుత్ లైన్లను మార్చాల్సి ఉంది. ఈ రెండుచోట్ల మరో వారంలో పనులు జరుగుతాయి. నవంబరు నెలాఖరు నాటికి ఈ పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యం. విద్యుత్ లైన్ల మార్పిడి ఆలస్యమైతే డిసెంబరు రెండో వారం నాటికి పూర్తి చేస్తారు. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే నూతన సంవత్సరంలో విజయవాడ వెస్ట్ బైపాస్‌ను ప్రారంభిస్తారు.

మారని బామ్మర్ది

(5వ పేజీ తరువాయి)

విజిలెన్స్ నివేదికపై చర్యలేవీ..?

వైసీపీ హయాంలో ఎన్టీఆర్ జిల్లాలో అడ్డగోలుగా గ్రావెల్ తవ్వకాలు జరిపిన వారిపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి నివేదిక ఇచ్చారు. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు, తాడేపల్లి, వేమవరం, పి.నైనవరం గ్రామాల్లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారించారు. కొత్తూరు గ్రామంలో సర్వే నెంబర్లు 35, 36, 40, 41, 45, 227లో గ్రావెల్ అక్రమంగా జరిగినట్టు నిర్ధారించారు. ఇక్కడ గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిపిన వారిలో తాడేపల్లికి చెందిన పావులూరి నాగేశ్వరరావు పేరును విజిలెన్స్ నివేదికలో ప్రస్తావించారు. తాడేపల్లి సర్పంచ్ ఉయ్యూరి గోపాలరావు పేరును కూడా పేర్కొన్నారు. వీరితోపాటు పోతురాజు మాధవరావు, కొండపనేని శేఖర్‌బాబు, పరికాల శ్రీనివాసరావు, తాడిశెట్టి నాగేశ్వరరావు.. గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిపినట్లు విజిలెన్స్ నివేదికలో ఉంది. తాడేపల్లి గ్రామంలోని సర్వే నెంబర్లు 255, 256, 260, వేమవరం గ్రామంలోని సర్వే నెంబర్లు 147, 148లో కూడా గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరిగినట్లు నిర్ధారించారు. పైన పేర్కొన్న వ్యక్తులతో పాటు బొడ్డు ప్రకాశ్‌రావు, సీహెచ్ రవి వర్మ తదితరులు తవ్వకాలు జరిపినట్లు నివేదికలో పేర్కొన్నారు. వీరిలో అత్యధికులు ప్రస్తుతం బామ్మర్ది వెంట తిరుగుతుండటం గమనార్హం. దీంతో వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా విజిలెన్స్ నివేదికను అటకెక్కించారు.

తెలుగు తమ్ముళ్ల ఆవేదన

ఐదేళ్లలో మైలవరం నియోజకవర్గంలో అడ్డగోలుగా గ్రావెల్, బూడిదను తరలించేసి సొమ్ము చేసుకున్న వారే మళ్లీ ఇప్పుడు హవా చెలాయిస్తున్నారని తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లలో వారి అక్రమాలను ప్రశ్నించిన తమపై కేసులు పెట్టి వేధింపులకు గురిచేశారని, ఇప్పుడు ఒకే పార్టీలో ఉండటంతో వారుచేసే పనులను ప్రశ్నించే పరిస్థితి కూడా లేకపోయిందని వారు పేర్కొంటున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

శివాలయం నిర్మాణానికి డాక్టర్ దుట్టా రూ.లక్ష విరాళం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ధర్మ కోనేరు చెరువు గట్టు మీద గ్రామస్థులు నిర్మాణం చేపట్టిన భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవాలయానికి వైసీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ దుట్టా రామచంద్రరావు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. సోమవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, వీరమాచనేని నాగయ్యలకు అందజేసి గ్రా మంలో అరుదైన మరకత లింగ ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. స్థానిక కిరాణా వ్యాపారి ఆరేపల్లి అప్పారావు రూ.50 వేలు విరాళం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

పొంగిపొర్లుతున్న చెరువు!

- ఎగువనుంచి కోనేరు చెరువులో చేరుతున్న వర్షపునీరు
- గట్టు కోతకు గురై రోడ్డుపైకి వస్తున్న నీరు
- ఐదేళ్లుగా గట్ల పటిష్టతపై దృష్టి సారించని పాలకులు
- భయాందోళనలో ఆత్కూరు గ్రామస్థులు



ఆత్కూరు కోనేరు చెరువు పొంగి రోడ్డుపైకి చేరిన నీరు

(ఉంగుటూరు - ఆంధ్రజ్యోతి)

మండలంలోని ఆత్కూరు కోనేరు చెరువు పొంగిపొర్లుతూ ప్రమాదకరంగా మారింది. ఎగువ నుంచి వర్షపునీరు చెరువులోకి వచ్చి చేరుతుండటంతో చెరువు పూర్తిస్థాయిలో నిండి రోడ్డుపైకి నీరు ప్రవహిస్తోంది. నీటి ఉధృతికి ఆగ్నేయ దిశలోని వాకింగ్ ట్రాక్, ఐరన్ గ్రిల్ ధ్వంసమవడంతోపాటు ర్యాంప్ మునిగిపోయి నీరు గట్టుదాటి రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీంతో ఎప్పుడు ఏప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. గ్రామం నడిబొడ్డున వున్న ఈ కోనేరు చెరువు అభివృద్ధి, ఆధునీకరణపనులు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టారు. చెరువు చుట్టూ గట్టును పటిష్టపరచడంతోపాటు గట్టుమధ్యలో వాకింగ్ ట్రాక్ నిర్మించారు. దీంతోపాటు గట్టుచుట్టూ ఎల్ఈడీ లైట్లు, పిల్లలకోసం జారుడుబల్లలు, ఊయలలు వంటి పలు క్రీడాపరికరాలు ఏర్పాటు చేశారు. అనంతరం అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో పరికరాలన్నీ ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆగ్నేయదిశలో చెరువుగట్టు కోతకు గురై నీరు గట్టుపైనుంచి రోడ్డుపైకి పొంగి ప్రవహిస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలు ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ చెరువులో కాలుజారి పడితే దానికి బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఆగ్నేయదిశలో చెరువుగట్టుగోడను పటిష్టపరచి, అక్కడ ఎవరూ చెరువులోకి దిగకుండా ఐరన్‌గ్రిల్ ఏర్పాటు చేయాలని, చెరువుగట్టుపై పెరిగిన భారీ వృక్షాల ఊడలను తొలగించాలని కోరుతున్నారు.



వెలుగు కార్యాలయం వద్ద కూరగాయలు విక్రయిస్తున్న వ్యవసాయ విభాగం సిబ్బంది

ఆర్గానిక్ కూరగాయల విక్రయాలకు విశేష స్పందన

హనుమాన్‌జంక్షన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగం మండల కార్యాలయాల సముదాయాల వద్ద సోమవారం నిర్వహించిన ఆర్గానిక్ కూరగాయల విక్రయ స్టాల్‌కు విశేష స్పందన లభించింది. మండలంలో పలు గ్రామాల్లో ప్రకృతి సేంద్రియ వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో పలువురు రైతులు కూరగాయల సాగు నిర్వహిస్తున్నారు. పండించిన కూరగాయలను బాపులపాడు మండల పరిషత్ కార్యాలయాల సముదాయం వద్ద స్టాల్ ఏర్పాటు చేసి పలు రకాల కూరగాయలను విక్రయించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు మీన మాధుర్య, సింధూ పాల్గొన్నారు.



సాధించిన ట్రోఫీని విద్యార్థులతో కలిసి చూపిస్తున్న ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్

క్విజ్ పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థుల జయకేతనం

గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించటంతోపాటు ట్రోఫీ షీల్డ్స్‌ను అందుకున్నారని ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోష్‌కుమార్ అన్నారు. స్థానిక సెయింట్ జాన్స్ పాఠశాలలో విజేతల అభినందన సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ, విజయవాడ సెయింట్ మాథ్యూస్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన బ్రదర్ జేమ్స్ మెమోరియల్ 37వ రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో సెయింట్ జాన్స్ విద్యార్థులు పాల్గొని మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. 8వ తరగతి విద్యార్థిని ఎన్ ఆరాధ్య, 7వ తరగతి విద్యార్థిని ఎ.గాయత్రి కృష్ణ, 6వ తరగతి విద్యార్థి కృష్ణదీప్ చక్కటి ప్రతిభను చూపారన్నారు. సీనియర్ బ్రదర్ జిమ్మి కురియాకోస్, సూర్యనారాయణ, బ్రదర్ బల్లా జోసఫ్, జయబాలన్ తదితరులు పాల్గొని విజేతలను అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ కేసరపల్లి, అజ్జంపూడి, బుద్ధవరం, బూతిమిల్లిపాడు, కొండపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆశాజ్యోతి పాఠశాలలో వైద్యశిబిరం ప్రారంభం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏలూరు రోడ్డులోని ఆశాజ్యోతి మానసిక దివ్యాంగుల పాఠశాలలో సోమవారం ఏలూరు ఆశ్రమం హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ జే.రాజేంద్రప్రసాద్ పాల్గొని శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రతి సోమ, గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల డైరెక్టర్ మాదవిలత తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల సీడీపీవో రాజశేఖర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పుచ్చల వెంకటేశ్వరరావు, హైమావతి, రాజేశ్వరరావు, ఆశాజ్యోతి హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మరీదు వెంకటస్వామి, పీఆర్వో దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ నేత యెనిగళ్ల జన్మదినం

ఉయ్యూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు జన్మదినం పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చినఓగిరాలలో ఆయన నివాసంలో కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది కుటుంబరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, కార్యకర్తల మధ్య కుటుంబరావు కేక్ కట్ చేశారు.



యెనిగళ్ల కుటుంబరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీడీపీ నాయకులు

గన్నవరాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



అమెరికాలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును సత్కరిస్తున్న టీడీపీ ఎన్నారైలు

గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గన్నవరాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా గన్నవరం నియోజక వర్గం నుంచి పోటీ చేసి అత్యధిక మెజార్టీతో విజయాన్ని సాధించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మొదటి సారిగా అమెరికా పర్యటనకు వెళ్లారు. అక్కడ ఎన్నారై టీడీపీ డల్లాస్ ఆధ్వర్యంలో టెక్సాస్‌లో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న ఎన్నారైలు యార్లగడ్డకు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. వేద పండితులు పూర్ణకుంభంతో పూజలు జరిపారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఎమ్మెల్యే యార్లగడ్డను కలిసిన రంగన్నగూడెంకు చెందిన ఎన్నారై తుమ్మల రాంబాబు, చంద్రశేఖర్

అభివృద్ధిలో ఎన్నారైలు కీలకపాత్ర పోషించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : జన్మభూమి స్ఫూర్తితో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో ఎన్నారైలు భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును రంగన్నగూడెం, కాకుల పాడుకు చెందిన ఎన్నారైలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జనవరిలో మొదలయ్యే జన్మభూమి 2లో ఎన్నారైలు కీలకపాత్ర పోషిస్తూ గ్రామాల అభివృద్ధికి సహకరించాలని సూచించినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే యార్లగడ్డను కలిసిన వారిలో రంగనగూడెంకు చెందిన తుమ్మల రాంబాబు, తుమ్మల చంద్రశేఖర్, కాకులపాడుకు చెందిన కామినేని శ్రీహరిబాబు తదితరులు ఉన్నారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం



బిడ్డను చూపుతున్న 108 సిబ్బంది

గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆ మహిళ పేరు పోలే లక్ష్మి, ఆమెది యూపీ రాష్ట్రం భర్త భగవాన్‌దేవ్‌తో పాటు మండలంలోని సూరంపల్లి ఇండస్ట్రీయల్ ప్రాంతంలో ఉంటున్నారు. అతను ఓ కంపెనీలో మిషనరీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆమె గర్భవతి. నెలలు నిండటంతో సోమవారం ఒక్కసారిగా నొప్పులు వచ్చాయి. దీంతో 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లే క్రమంలో నొప్పులు మరింత పెరిగాయి. అంబులెన్స్‌లోనే ప్రసవం అయ్యి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి బిడ్డకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాన్పు చేసి ఆస్పత్రికి తరలించారు. 108 వాహన ఈఎం టి.వెంకయ్య, పైలెట్ శ్రీనివాసరావుకు ఆమె బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.



భక్తులతో కిక్కిరిసిన ఉయ్యూరు శివాలయం

శివాలయాల్లో కార్తీక సందడి

ఉయ్యూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాస సోమవారం పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. కార్తీకమాసంలో తొలి సోమవారం కావడంతో వేకువజాము నుంచి ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో శివాలయాల్లో భక్తుల సందడి కన్పించింది. ఆలయాల్లో ఉదయం, సాయంత్రం మహిళలు కార్తీక దీపారాధన చేసి ప్రత్యేక పూజలు చేశారు. పెదఓగిరాల, చినఓగిరాల, ఆకునూరు, బోళ్లపాడు, ముదు నూరు, కలవపా ముల, వీరవల్లి గ్రామాల్లో పూజలు చేశారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు



పెదఓగిరాల గ్రామసభలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో, తహసీల్దార్

ఉయ్యూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలను భూ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హేలాషారోన్ అన్నారు. రీసర్వే భూ సమస్యల పరిష్కారంలో భాగంగా పెదఓగిరాలలో సోమవారం గ్రామ సభ నిర్వహించి భూ యజమానుల నుంచి సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు తహసీల్దార్ సురేశ్ కుమార్ సర్పంచ్ త్రిపురం లక్ష్మి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శివరామప్ర సాద్, ఆర్ఐ యతేంద్రులు, వీఆర్వో అమలేశ్వరరావు పాల్గొన్నారు.



పంజాబ్ నేషనల్ బ్యాంకు సర్కిల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన విజిలెన్స్ అవేర్‌నెస్ వాక్‌థాన్

అవినీతి నిర్మూలనకు బ్యాంకు ఉద్యోగులు చిత్తశుద్ధితో వ్యవహరించాలి

ఆటోనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అవినీతి నిర్మూలనపై బ్యాంకు ఉద్యోగులు చిత్తశుద్ధితో, పారదర్శకంగా వ్యవహరించాలని పంజాబ్ నేషనల్ బ్యాంకు సర్కిల్ హెడ్ డీజీఎం అభిజిత్ సిన్హా అన్నారు. సోమవారం విజయవాడ పంజాబ్ నేషనల్ బ్యాంకు విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. కామయ్యతోపు సెంటర్ నుంచి ప్రారంభమైన వాక్‌థాన్‌లో బ్యానర్లు, ప్లకార్డులతో అవినీతి వ్యతిరేకంగా నినాదాలతో సాగింది. అనంతరం అభిజిత్ సిన్హా సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కార్యాలయాల్లో సమగ్రతా ప్రతిజ్ఞ చేశారని తెలిపారు. తాళ్లూరు మండలం తూర్పు గంగవరంలోని వృద్ధాశ్రమానికి, పీహెచ్‌సీకి రిఫ్రిజిరేటర్, అల్మిరాలు, రాక్‌లు విరాళంగా అందించారు. సీఎస్ఆర్ కార్యచరణ కింద ప్రకాశం జిల్లాలోని అంక్ గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు తెలిపారు.

ఊపందుకున్న పట్టభద్రుల ఓట్ల నమోదు



కానూరులో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపెయిన్‌లో అంగిరేకుల మురళి

పెనమలూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఓటర్ల నమోదుకు గడువు ఈ నెల ఆరున ముగుస్తుండంతో పట్టభద్రులు ఓటు నమో దు చేయించుకోవడానికి ఓటు నమోదు కేంద్రాలకు తరలివస్తున్నారు. కేవలం రెండు రోజులే గడువు ఉండడంతో ఒక్క సోమవారం రోజే వెయ్యికి పైగా పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకొన్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సోమవారం కానూరులో టీడీపీ నాయకులు అంగిరేకుల మురళి, సందు సురేష్, చిట్రోజు నాగేంద్రబాబు, కరిమికొండ సురేష్, మైనం వెంకటేశ్వరరావు, సుంకర శ్రీధర్‌లు పట్టభద్రుల ఓటర్లకు సహాయక క్యాంపు ఏర్పాటు చేసి ఓటర్లకు తగు సూచనలిచ్చారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఎమ్మెల్సీ ఓట్ల నమోదు నవంబరు 6వ తేదీతో ముగుస్తుందని అర్హులైన వారు త్వరితగతిన ఆన్‌లైన్ ద్వారా గానీ, ఫారం-18తో అర్హత ధృవపత్రాలు (అటెస్టెడ్ కాపీ) కూడిన దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. కాకుల పాడు, మడిచర్ల, కోడూరుపాడులకు చెందిన వారు సోమవారం దరఖాస్తులను కార్యాలయంలో ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జోగేశ్వర రావు, యూనిట్ ఇన్‌చార్జి చలసాని శ్రీనివాస్, పుట్టా సురేష్, కొండపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జంక్షన్ తహసీల్దార్ కార్యాలయంలో..



విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ రామోజీరావు, ఏవో వై.మధుసూధనరావు

పేపర్ ప్రజంటేషన్‌లో డెంటల్ విద్యార్థుల ప్రతిభ


గన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో జరిగిన రాష్ట్రస్థాయి 43వ డెంటల్ సదస్సులో పాల్గొని పేపర్ ప్రజంటేషన్ చేసి బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు తెలిపారు. సోమవారం మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్‌లో సోమవారం వివరాలను మీడియాకు ప్రిన్సిపాల్ రామోజీరావుతో పాటు ఏవో వై.మధుసూధనరావు తెలిపారు. పీడియాట్రిక్ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్రీ విభాగంలో పీజీ ఫైనలియర్ చదువుతున్న డాక్టర్ షేక్ షాహిద్ బాషా, డాక్టర్ పి.సాయి రమ్యశ్రీ, డాక్టర్ మహతీ, ఆర్థోడోంటిక్స్ డెంటిస్ట్రీ విభాగంలో పీజీ సెకండియర్ విద్యార్థినీ డాక్టర్ ఎస్.మేఘనలు సదస్సులో పాల్గొని పేపర్ ప్రజంటేషన్ చేసి మొదటి, ద్వితీయ బహుమతులు సాధించారు. బీడీఎస్ ఇంటర్న్ షిప్ చేస్తున్న డాక్టర్ సీహెచ్ లక్ష్మీకస్తూరికి బెస్ట్ ఔట్‌గోయింగ్ అవార్డును అందజేశారు. డాక్టర్‌లు అజయ్ బెనర్జీ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో వీరవల్లి విద్యార్థికి ద్వితీయ స్థానం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల దినోత్సవ సందర్భంగా కృష్ణాజిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వీరవల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థి నాగదినేష్ ద్వితీయస్థానం సాధించారు. కృష్ణాజిల్లా ఎస్పీ గంగాధర్‌రావు విద్యార్థిని అభినందించి రూ.3వేల నగదు బహుమతిని సోమవారం అందజేశారు. వీరవల్లి హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థి కె.నాగదినేష్ 'సమాజానికి పోలీసుల 'సేవలు' అనేఅంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొని ద్వితీయ బహుమతి సాధించడం అభినందనీయమని హెచ్ఎం నిర్మల అన్నారు.







చక్రవ్యూహం

హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చేందుకు ముఖద్వారంగా ఉన్న గొల్లపూడి వన్ సెంటర్ ఒక క్రమపద్ధతి లేని ట్రాఫిక్ చక్రవ్యూహంలో చిక్కుకుని విలవిల్లాడుతోంది. అక్కడ రోడ్లేమన్నా ఇరుకుగా ఉన్నాయా అంటే అదేం లేదు. విశాలమైన రోడ్లున్నాయి. మరి ఎందుకు అంటే ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యమని సమాధానం వస్తోంది. వాహనదారులు ఒక క్రమ పద్ధతి లేకుండా ఎటు పడితే అటు ఖాళీ కనిపిస్తే చాలు రాంగ్ రూట్ అయినా పర్లేదు అనుకుంటూ వెళ్తున్నారు. పైగా ట్రాఫిక్ పోలీసులు ఎదురుగా ఉన్నా భయపడటం లేదు. ఎంతో స్వేచ్ఛగా ఎదురు వెళ్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.







మహోన్నత దాతలు



అన్నార్తులకు అన్న ప్రసాదం అందిస్తున్న పుట్టగుంట

విజయవాడకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీశ్ కుమార్‌కు బాపులపాడు మండలం బొమ్ములూరు వద్ద లెదర్ ఫ్యాక్టరీ ఉంది. సుమారు 15ఏళ్ల క్రితం ఓ రోజు కారులో వెళుతుంటే కాలినడకన వెళుతున్న భవానీలు కనిపించారు. సుదూరం నుంచి వస్తుండటంతో కాళ్లకి పుండ్లు పడి రోడ్డు పక్కనే కూర్చుని సేద దీరుతుడగా చూశారు. వారిలో మహిళలు, వృద్ధులు, చిన్నారులుండటం చూసి మనసు చలించింది. తన వంతు ఏం చేయగలనాని ఆలోచించారు. అన్న దానాన్ని మించింది లేదని తలచి వెంటనే వారికోసం తన ఫ్యాక్టరీ ఆవరణలో అన్నప్రసాద వితరణ కేంద్రం ఏర్పాటుకు నడుం బిగించారు. కృష్ణా జిల్లా ముఖద్వారమైన బొమ్ములూరులో ఏర్పాటు చేశారు. కాలి నడక సుదూరాల నుంచి వస్తున్న భవానీలకు 15ఏళ్లుగా అన్నదానంతోపాటు విశ్రాంతి కోసం వసతి, వైద్య సదుపాయాలను కల్పిస్తున్నారు. దీక్షాసమయంలో భవానీలు పాటించే అన్ని నియమాలను తాను కూడా పాటిస్తూ శుచి, శుభ్రతతో కూడిన ఆహారంతోపాటు భక్తుల కాళ్లకు బొబ్బలొస్తే స్వయంగా తానే వారి కాళ్లకు లేపనాలు రాస్తూ మానవ సేవే మాధవ సేవ అన్న దాన్ని ఆచరించి చూపుతున్నారు. ఇలాంటి అన్న ప్రసాద వితరణతో కూడిన వసతి, వైద్య శిబిరం ఎక్కడా కనిపించలేదని ఒడిశాకు చెందిన భవానీ భక్తబృంద సభ్యులు పుట్టగుంటకు కితాబిచ్చారు. ఆయన సేవలను గుర్తించి ఉన్నతాధికారులతోపాటు ప్రముఖ వైద్యులు, సినీ నటులు కూడా ఈ సేవలో పాల్గొనేందుకు ముందుకు రావడం గమనార్హం.

అన్నం పరబ్రహ్మ స్వరూపం.. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అంటారు. ఏది దానంగా ఇచ్చినా.. ఎంత ఇచ్చినా.. ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది. కానీ అన్నదానం చేస్తే దానం తీసుకున్న వారు ఇంక చాలు అని చెప్పి సంతృప్తి పడతారు. అలాంటి మహోన్నతదాతలే ఈ పుట్టగుంట సతీశ్, అడపా సోదరులు. - హనుమాన్ జంక్షన్ రూరల్ - ఆంధ్రజ్యోతి



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భవానీలు, భక్తులు



భవానీల పాదాలకు లేపనం పూస్తున్న సతీష్‌కుమార్



అడపా యుగంధరరావు, దేవులబాబు ఆధ్వర్యంలో పూజ

అయ్యప్పల సేవలో..

బాపులపాడు మండలం శేరీనరసన్నపాలెంలో అడపా యుగంధరరావు గురుస్వామి ఆధ్వర్యంలో పదేళ్లుగా అయ్యప్పలకు భక్తిశ్రద్ధలతో బిక్ష ఏర్పా టు చేస్తున్నారు. గురుస్వామి ఆధ్వర్యం లో దేవులబాబు, సతీష్ పర్యవేక్షణలో 41 రోజుల పాటు ప్రతి రోజూ సుమా రు 200 మందికిపైగా దీక్షాదారులకు అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నా రు. గ్రామాల్లోని అయ్యప్ప దీక్షాదారులకు ప్రతిరోజూ ప్రత్యేక పూజ అనంత రం మధ్యాహ్నం 2గంటల వరకు అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు దేవులబా బు తెలిపారు. అనివార్యకారణాలతో ఇంటివద్ద బిక్ష చేసుకోలేని దీక్షాపరులతోపా టు అయ్యప్పలకూ పదేళ్లుగా అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు తెలిపారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్ తేదీలు మార్చండి



అనూరాధకు వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నేతలు

వన్‌టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు జనవరి 5 నుంచి కాకుండా ఫిబ్రవరిలో నిర్వహించేలా ఒక నెల పాటు పరీక్షల షెడ్యూల్ తేదీలను పొడిగించాలని కోరుతూ డీవైఎఫ్ఐ నేతలు సోమవారం ఏపీపీఎస్సీ చైర్ పర్సన్ అనూరాధకు వినతి పత్రం అందజేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము ఆధ్వర్యంలో అనూరాధను కలిసి గ్రూప్-2కు సంబంధించి గతేడాది డిసెంబరులో 899 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని, ఈ ఏడాది ఫిబ్రవరి 25న 4లక్షల మంది ప్రిలిమ్స్ పరీక్ష రాశారన్నారు. ఏప్రిల్ 10న ఫలితాలు ప్రకటించారని, జూలై 28న మెయిన్స్‌కు నిర్వహించాల్సిన పరీక్షను సంస్థకు చైర్మన్ లేక వాయిదా వేశారన్నారు. ఇప్పుడు ఆకస్మికంగా జనవరి 5 నుంచి మెయిన్స్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారని, దీంతో పేద అభ్యర్థులకు నష్టం జరుగుతుందన్నారు. సిలబస్‌ను దృష్టిలో పెట్టుకుని 90 నుంచి 120 రోజులు గడువు ఇవ్వాలన్నారు. డిసెంబరు చివరి వారంలో పోలీస్ కానిస్టేబుల్ ఈవెంట్స్, రైల్వే పరీక్షలు వంటివి ఉన్నాయని, ఏపీపీఎస్‌సి ప్రకటించిన గ్రూప్ టూ మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌కు సిద్ధం కావటం కష్టతరమవుతుందన్నారు. మరోవైపు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టకపోవటంతో ఏపీ అర్థశాస్త్రం అభ్యర్థులు ఎలా అవగాహన చేసుకోగలుగుతారని ప్రశ్నించారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా కోర్టు మెట్లు ఎక్కకుండా చూసేందుకు ప్రకటించిన షెడ్యూల్‌ను సవరించి ఫిబ్రవరిలో పరీక్షలు నిర్వహించేలా చూడాలని కోరారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

● జిల్లా అదనపు పర్యవేక్షణాధికారి జ్యోతి

కృష్ణలంక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రాలు ఇతర ఏదైనా చట్టం కింద లైసెన్సు తీసుకున్నా, జువైనల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం 2015లోని సెక్షన్ 41 కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా అదనపు పర్యవేక్షణాధికారి పి.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సవరించిన చట్టాలు, నిబంధనల మేరకు 'రక్షణ సంరక్షణ అవసరమైన పిల్లల' కోసం పూర్తిగా కానీ, లేదా పాక్షికంగా కానీ నడుపబడుతున్న బాలసంరక్షణ కేంద్రాలు జువైనల్ జస్టిస్ చట్టం 2015లోని సెక్షన్ 41 కింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దీనిపై ప్రభుత్వం ఈ నెల 22న అధికారిక ప్రకటన జారీ చేసిందన్నారు. దరఖాస్తు సహా అన్ని కాపీలు జతచేసిన ఈ నెల 11లోగా సంచాలకులు, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధిబాలల సంక్షేమ శాఖ, విజయవాడ కార్యాలయానికి పంపాలన్నారు. పూర్తి నోటిఫికేషన్, చిరునామా, అర్హతలు, జతపరచాల్సిన డాక్యుమెంట్లు చెక్‌లిస్టులు మొదలైన వాటిని హెచ్‌టీటీపీ://డబ్ల్యుడిసిడబ్ల్యు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. దరఖాస్తులను స్పీడ్‌పోస్టు, రిజిస్టర్ పోస్టు ద్వారా మాత్రమే సాఫ్ట్ కాపీస్ సీసీఐ.ఆర్‌ఈజీ2024ఎట్‌దిరేట్‌ఆఫ్‌జీమెయిల్.కామ్ ద్వారా పంపాలన్నారు. వివరాలకు ఎన్టీఆర్ జిల్లా అదనపు పర్యవేక్షణాధికారి 7780399779, ఎం.రాజేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా బాలల సంరక్షణ అధికారి 9948057583 వారిని సంప్రదించవచ్చునని జిల్లా అదనపు పర్యవేక్షణాధికారి పి.జ్యోతి కోరారు.



ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం

ఐజీఎంసీ స్టేడియానికి
దొంగల బెడద

● విలువైన కాపర్‌వైర్లు, ఫ్లడ్‌లైట్లు, పంపుల బిరడాల చోరీ

● స్థానిక బ్లేడ్, గంజాయి బ్యాచ్‌ల హల్‌చల్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియానికి దొంగల బెడద పెచ్చుమీరుతోంది. వివిధ క్రీడా సంఘాల అసోసియేషన్ల హాల్స్, స్టేడియం ఆవరణలోని ఫ్లడ్‌లైట్లు, టాయిలెట్లలో ఇనుప పంపులు చోరుల పాలవుతున్నాయి. స్టేడియం పరిసరాల్లోని శిఖామణి సెంటర్, కస్తూరిబాయి పేటల్లోని గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు చెందిన యువకులు వారి రోజువారీ అవసరాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ హాల్‌లోని ఏసీలకు చెందిన అవుట్‌డోర్లకు ఉండే కాపర్‌వైర్లు 3 నెలలు క్రితం చోరీకి గురయ్యాయి. చిన్నారుల శిక్షణకు ఇబ్బందుల్లేకుండా ఏసీలను ఏర్పాటు చేయగా, వాటి అవుట్‌డోర్ యూనిట్లు బయటకు ఉండటం, వాటికుండే కాపర్ వైర్లను కట్ చేసుకుని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు వేలల్లో ఖర్చుపెట్టి వాటికి కొత్తగా కాపర్‌వైర్లను వేయించుకున్నారు. వీటికి వేలల్లో ఖర్చవుతోంది. ప్రమాదకరమైన స్థాయిలో వైర్ల దొంగతనాలకు బరితెగించి మరీ కాపర్ వైర్లు కట్ చేసుకుని పోతుండటంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. క్రికెట్ అసోసియేషన్, అథ్లెటిక్స్, వాకర్స్ అసోసియేషన్ల ఏసీలకు చెందిన కాపర్‌వైర్లు ఇటీవల చోరీకి గురయ్యాయి. నెట్‌బాల్ పోల్స్, మరుగుదొడ్లలో వాడే ఇనుప బిరడాలు ఎత్తుకుపోయారు. పోలీసుల అమరవీరుల దినోత్సవానికి రెండు రోజుల ముందు ఈ కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. దీంతో టీటీ కోచ్ శ్రీనివాస్ మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ పురోగతి లేదు. వాచ్‌మెన్లు తిరుగున్నా రాత్రి 11 గంటలకు దాటాక ఈ విచ్చలవిడి దొంగతనాలకు స్థానిక యువకులు పాల్పడుతున్నారు. వీరి ఆటకట్టించి విలువైన వస్తువులు చోరీకి గురికాకుండా చూడాలని అసోసియేషన్లు, కోచ్‌లు కోరుతున్నారు. ఇటువైపు పోలీసుల నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇసుక దందాలో కొత్త కహానీ

● వరుస సోదాలతో ఇసుకాసురులు ఉక్కిరిబిక్కిరి ● ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కుంటున్న మాఫియా

● భారీగా వాహనాల కొనుగోళ్లు ● తెలంగాణ భూభాగంలో ఇసుక డంప్‌లు ● అక్కడా డ్రోన్లు ఎగురవేయాలని కాప్స్ నిర్ణయం



ప్రభుత్వం ఉచిత ఇసుకకు అనుమతిచ్చిన తర్వాత ఎన్టీఆర్ జిల్లాలో తెలంగాణ సరిహద్దును అనుకుని ఉన్న గ్రామంలో ఒక వ్యక్తి ఒకటి, రెండు కాదు... ఏకంగా 50 కొత్త ట్రాక్టర్లను కొనుగోలు చేశాడు. టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు కొద్దిరోజులుగా గ్రామాలను జల్లెడ పట్టినప్పుడు వెలుగులోకి వచ్చిన విషయం ఇది. ఇసుకను తరలింపునకు కొనుగోలు చేసినట్టు యజమాని అంగీకరించాడు. దీంతో పోలీసులకు నోటమాట రాలేదు. మరో గ్రామంలో ఓ వ్యక్తి 4 టిప్పర్లను లీజుకు తీసుకుని తన ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో నిలిపాడు. తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో పోలీసులు, రెవెన్యూ, భూగర్భ గనుల శాఖ అధికారులు వరుసగా చేస్తున్న సోదాల్లో వెలుగులోకి వచ్చిన అంశాలివి.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ

అధికారులు చేస్తున్న తనిఖీల్లో ఇసుకాసురులకు సంబంధించిన కొత్త కథలు బయటకు వస్తున్నాయి. ఇసుకపై ఇంత దారుణంగా వ్యాపారం సాగుతుందా అని అధికారులే ఆశ్చర్యపోతున్నారు. జిల్లాలో ఇసుక కొరతకు వరదలు ఒక కారణమైతే, ఇసుకను అక్రమంగా తెలంగాణ సరిహద్దులు దాటించడమే ప్రధాన కారణమని గుర్తించారు. ఈ బృందాలు రీచ్‌లు మొదలుకొని చుట్టుపక్క ప్రాంతాల్లో డంప్ చేసిన ఇసుక సీజ్ చేయడంతో ఈ మాఫియా ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

జిల్లాలోనే అత్యధిక ఎక్స్‌కవేటర్లు

జీపీఎస్ పరికరాలున్న వాహనాలను మాత్రమే రీచ్‌ల్లోకి అనుమతించాలని అధికారులు నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ వాహనాలు కచ్చితంగా భూగర్భ గనుల శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అలాంటి వాహనాలను మాత్రమే రీచ్ వద్దకు వెళ్తాయి. జిల్లాలో గుర్తించిన 15 ఇసుక రీచ్‌ల్లో 11 లక్షల మెట్రిట్ టన్నుల ఇసుకు లభ్యత ఉందని భూగర్భ గనుల శాఖ లెక్కలు తేల్చి ప్రభుత్వానికి పంపింది. ఇప్పటి వరకు నిలిచిన నీరు తగ్గిపోవడంతో త్వరలో తవ్వకాలను చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్లలో 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఉంది. జీపీఎస్ వాహనాలు రీచ్‌ల్లో ఇసుకను లోడ్ చేసుకుని స్టాప్ పాయింట్ల వద్ద దింపాలి. ఎక్స్‌కవేటర్లు ఆయా వాహనాల్లోకి లోడ్ చేస్తాయి. తవ్వకాలు ఆరంభమయ్యాక ఈ ఎక్స్‌కవేటర్లను రాత్రి సమయాల్లో ఉపయోగించుకుని ఇసుకాసురులు తోడేస్తారని భావించిన పోలీసులు వాటి లెక్కలు తీశారు. రాష్ట్రంలో మొత్తం ఎక్స్‌కవేటర్లు ఎన్ని ఉన్నాయన్న లెక్కలను పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు రప్పించుకుని చూడగా ఎన్టీఆర్ జిల్లాలోనే అత్యధికంగా ఉన్నట్టు తేలింది. మొత్తం 1500 ఎక్స్‌కవేటర్లున్నాయని గుర్తించారు. ఇప్పటికే వాటి యజమానులకు నోటీసులిచ్చారు. త్వరలో వీటికి జీపీఎస్ పరికరాలను అమర్చాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

తెలంగాణలో ఏపీ డ్రోన్లు?



ఇసుక మాఫియా అక్రమంగా డంప్ చేసిన గుట్టలను డ్రోన్లతో గుర్తించిన పోలీసులు తెలంగాణ సరిహద్దు దాటి వాటిని ఎగురవేయాలని భావిస్తున్నారు. జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు నియోజకవర్గాల నుంచి వివిధ మార్గాల్లో తెలంగాణకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ ఇసుకను తెలంగాణ సరిహద్దు దాటాక డంప్ చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. జిల్లాలోని రీచ్‌ల వద్ద ఎగురవేసినట్టుగానే డ్రోన్లను తెలంగాణ సరిహద్దులు దాటించాలని పోలీసులు నిర్ణయించారు. ఇలా గుర్తించిన ఇసుక డంప్‌లను సీజ్ చేసి జిల్లా సరిహద్దులోకి తీసుకురావాలన్న ప్రణాళికపై అధికారుల మధ్య చర్చలు నడుస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంతోనే యాదవ కల్యాణ మండప నిర్మాణం

● మంత్రులు పార్థసారథి, రవీంద్ర, ఎంపీ బాలశౌరి ● రూ.3 కోట్లతో నిర్మాణం



ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

మచిలీపట్నం టౌన్ , నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాదవ కల్యాణ మండప నిర్మాణం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మచిలీపట్నం గాంధీ విద్యాలయానికి దగ్గరగా రూ.3కోట్లతో నిర్మించనున్న యాదవ కల్యాణ మండపానికి సోమవారం మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి శంకుస్థాపన చేశారు. పునాదులతో నిలిచిన కల్యాణ మంటపానికి ఎంపీ బాలశౌరి సీఆర్‌ఎస్ ఫండ్స్, ఇతర ఎంపీ నిధులు రూ.కోటి 35 లక్షలు తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ యాదవ కులస్థుల కల ఈనాటికి ఎంపీ బాలశౌరి చొరవతో నెరవేరిందన్నారు. ఈ భవన నిర్మాణ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్లానన్నారు. తన మామ నడకుదిటి నరసింహారావు పేరున భవన నిర్మాణానికి రూ.25 లక్షలు ఇస్తానని, స్నేహితులతో మరికొంత ఇప్పిస్తానన్నారు. వచ్చే కార్తీక మాసానికి ఇక్కడే కార్తీక వన సమారాధన జరగాలన్నారు. శారదానగర్‌లో బీసీ భవనానికి ఎకరం స్థలం కేటాయించామని, కానీ భవన నిర్మాణానికి వైసీపీ పాలకులు అడ్డు పడ్డారన్నారు. టీడీపీకి మద్దతు తెలిపిన యాదవులపై వైసీపీ నేతలు అక్రమంగా కేసులు బనాయించారన్నారు. బీసీ భవనం నిర్మించి తీరుతామన్నారు. అంబేడ్కర్ భవనానికి నిధులు తెస్తామన్నారు. రోడ్లపై పశుసంచారంపై యాదవ కులస్థులను ఇబ్బందులు పెడుతున్నారని నాగార్జున చెప్పగా కొంతస్థలం చూస్తామని మంత్రి తెలిపారు. మరో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ యాదకులకు కూటమి ప్రభుత్వంలోనే సరైన న్యాయం జరుగుతుందన్నారు. తన తండ్రి, మాజీ ఎంపీ రెడ్డియ్య పేరున భవన నిర్మాణానికి రూ.15లక్షలు ఇస్తానన్నారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ ఈ భవనానికి శ్రీకృష్ణ యాదవ భవనం పేరు పెట్టాలన్నారు. న్యాయవాది ఎఆర్‌కే మూర్తి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చుల బోసుబాబు, మాజీ కౌన్సిలర్ నాళ్ల మాధవ, టీడీపీ నేతలు కొనకళ్ల బుల్లయ్య, రొండు కృష్ణయాదవ్, మోటమర్రి బాబా ప్రసాద్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, జనసేన నేతలు మాదివాడ రాము, గడ్డం రాజు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అభివృద్ధికి చిరునామా రోడ్లే

● జగన్ పాలనలో రోడ్లన్నీ సర్వనాశనం ● ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ ● బందరు రోడ్ల మరమ్మతులకు రూ.30 కోట్లు



రోడ్డు రోలర్ నడుపుతూ పనులను ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర, చిత్రంలో ఇన్‌చార్జి మంత్రి సుభాష్

మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రోడ్లన్నీ సర్వనాశనమయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధికి చిరునామాగా రోడ్ల నిర్మాణాలు చేపట్టామని జిల్లా ఇన్‌చార్జి, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం కాలేఖాన్‌పేట కోనరోడ్డులో గుంతలమయంగా ఉన్న రోడ్ల మరమ్మతు పనులకు ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, అబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించలేదని, దీంతో ఎన్నో రోడ్డు ప్రమాదాలు సంభవించి ఎంతో మంది దివ్యాంగులయ్యారన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.4,500 కోట్లతో పనులు ప్రారంభించిందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మచిలీపట్నంలో 19 చోట్ల గుంతలను అభివృద్ధి చేసేందుకు రూ.30కోట్లు విడుదల చేశామన్నారు. వచ్చే సంక్రాంతి నాటికి నిర్మాణాలు పూర్తిచేస్తామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ బాలాజీ, ఎంపీ వల్లభనేని బాలశౌరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, వేము కోటేశ్వరరావు, టీడీపీ నేతలు ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, సనకా నాగులు, తలారి సోమశేఖర్, లంకే హరికృష్ణ, లంకే నారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రికి స్వాగతం

జిల్లా కేంద్రమైన మచిలీపట్నానికి తొలిసారిగా సోమవారం వచ్చిన ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్ గంగాధరరావు, ఏఎస్పీ సత్యనారాయణ, ఆర్డీవో కే స్వాతి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితుల గురించి కలెక్టర్, ఎస్పీతో మంత్రి సుభాష్ చర్చించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132,141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.555

ఘనంగా గ్యార్మీ వేడుకలు

గుడివాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 11వ వార్డులో షాహె నూర్ జెండా కమిటీ ఆధ్వర్యంలో గ్యార్మీ షరీఫ్ జెండా పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు లింగం ప్రసాద్, జగన్మోహనరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.


గ్యార్మీ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న పేకేటి సీతారామిరెడ్డి

కాజలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కూచిపూడి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాజలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధ్యక్షుడు పేకేటి సీతారామరెడ్డి ఇంటి ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ప్రకృతి వ్యవసాయ నిపుణులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు తయారు చేసే విధానం, వాటి ఉపయోగాలు వివరించారు. ఎలాంటి తెగుళ్లకు ఏ విధమైన కషాయాలు ఉపయోగించాలి, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడుల సాధన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు వెంకట లక్ష్మి, నాగమల్లేశ్వరి, గంగరాజు, రాంబాబు, సాయినాథ్ పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

గుడివాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.హరికుమార్ ఆధ్వర్యంలో హోమియోపతి వైద్యనిపుణుడు వారణాసి గాయత్రీ ప్రసాద్ కుమారుడు మురళీ కృష్ణప్రసాద్ జన్మదినం సందర్భంగా సోమవారం బేతవోలులోని శాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కొత్త సుబ్బారావు, సయ్యద్ గఫార్, తిరుపతయ్య, మునీంద్ర, మాకుల సత్యం, కుంభం నాగమణి, జి.ఈశ్వరి, జాజుల తాతారావు పాల్గొన్నారు.

గజానికో గుంత!

పెదపారుపూడి, జువ్వనపూడి గ్రామాల మధ్య వాహనదారుల అవస్థలు

(ఆంధ్రజ్యోతి-పెదపారుపూడి)

పెదపారుపూడి నుంచి ఉయ్యూరు వెళ్లే ప్రధాన ఆర్ అండ్ బీ రహదారిపై పెదపారుపూడి, జువ్వనపూడి గ్రామాల మధ్య పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గజానికో గుంత ఉండటంతో చిన్నపాటి వర్షానికి అవి పెద్దవిగా మారాయి. 222 నంబరు బస్సు గుడివాడ నుంచి ఉయ్యూరుకు ఈ మార్గంలోనే జువ్వనపూడి, అప్పికట్ల, ముదునూరు, బోలపాడు, కడవకొల్లు, ఉయ్యూరు నుంచి విజయవాడ వెళుతుంది. అందులో ప్రయాణించే ప్రయాణికులు ఈ గోతుల్లో నానా అవస్థలు పడుతున్నారు. త్వరగా రోడ్డును నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


పెదపారుపూడి నుంచి ఉయ్యూరు వెళ్లే ఆర్ అండ్ బీ ప్రధాన రహదారిపై గుంతలు

రైతుల ఇబ్బందులు వర్ణనాతీతం



జువ్వనపూడి రహదారిపై రైతులు నిత్యం ఎరువులు, ధాన్యం, వరిగడ్డి తోలుకుంటారు. ఈ గోతుల్లో ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, ద్విచక్రవాహనాల్లో వాటిని చేర వేయడానికి చాలా ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే గుంతలు పూడ్చించాలని రైతులు కోరుతున్నారు.

- గారపాటి వీర నాగబాబూరావు, పెదపారుపూడి మాజీ సర్పంచ్

కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలి



గతంలో వైసీపీ ప్రభుత్వం కనీసం రహదారికి మరమ్మతులు కూడా చేయలేదు. దీంతో నానా అవస్థలు పడుతున్నాం. రోడ్డుపై ప్రమాదాలు జరిగినా రోడ్డును బాగుచేయలేదు. కూటమి ప్రభుత్వమైనా పట్టించుకుని రహదారి నిర్మించాలి.

-చాపరాల పున్నయ్య, పెదపారుపూడి గ్రామస్థుడు


మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరిని సత్కరిస్తున్న ఆలయ ఈవో కొండలరావు

కొండాలమ్మ సేవలో కొల్లు రవీంద్ర, వల్లభనేని బాలశౌరి

గుడ్లవల్లేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేమవరంలో కొండాలమ్మ అమ్మవారిని పలువురు ప్రముఖులు సోమవారం దర్శించుకొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు కొండాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎ.కొండలరావు ఆలయ సంప్రదాయం ప్రకారం శేష వస్త్రంతో సత్కరించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

శివాలయాల్లో కార్తీక పూజలు

పామర్రు/పెదపారుపూడి/కూచిపూడి/గుడివాడ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం ఆకాశదీపాలు, సామూహిక కార్తీక దీపాలను వెలిగించారు. శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు జరిపారు. పామర్రు మండలంలోని ప్రాకర్ల, రాపర్ల, పెద మద్దాలి, కురుమద్దాలి, శివాలయాల్లో కార్తీక పూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు.


పామర్రు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


కూచిపూడిలో అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

వానపాములలో..

వానపాముల గ్రామంలో గంగాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో స్వామికి అర్చకస్వామి రాంబాబు అభిషేకం చేశారు.

ఏకాదశ రుద్రాభిషేకాలు, పూజలు

చినముత్తేవి అన్నపూర్ణా సమేత సోమేశ్వరస్వామి, కూచిపూడి బాలాత్రిపుర సుందరిదేవి, మొవ్వ భీమేశ్వరస్వామి ఆలయాలతోపాటు అయ్యంకి, పెదపూడి, కాజ, కోసూరు, నిడుమోలు దేవాలయాల్లో స్వామివార్లకు అలంకరణ, అభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేష పూజలు, దీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు.

తెల్లవారుజాము నుంచే దర్శనాలు

గుడివాడ పట్టణంలోని పెద్ద శివాలయం, చిన్న శివాలయాల్లో తెల్లవారుజామున 4గంటల నుంచే నిరంతర దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మహిళా భక్తులు ఆలయ పరిసరాల్లో కార్తీక దీపాలను వెలిగించారు.


గుడివాడ శివాలయంలో కార్తీక పూజలు

రోడ్లేసిన కాంట్రాక్టర్లకు పాత బకాయిలు చెల్లించండి

● కుదరవల్లి మాజీ సర్పంచ్ మసిముక్కు వేణు వినతి

నందివాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్లె వెలుగులు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని రహదారులన్నీ సీసీ రోడ్లుగా మార్చాలని కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన గ్రాంట్లతో కాంట్రాక్టర్లు గ్రామాల్లో రోడ్లు వేస్తున్నారని, అయితే అధికారులు కొత్త పనులు ప్రారంభించటం కాదు, ఆగిపోయిన పాత పనులు పూర్తి చేశాకే కొత్త పనులు మొదలు పెట్టాలంటున్నారని కుదరవల్లి మాజీ సర్పంచ్ మసిముక్కు వేణు సోమవారం విలేకరులకు తెలిపారు. ఏడేళ్ల క్రితం నిర్మించిన రోడ్లకు ఇంత వరకు డిపాజిట్లు, 21 శాతం బిల్లులు రావాలని ఆయన పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాత బకాయిలు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచాయతీలపై ప్రత్యేక శ్రద్ధతో రోడ్లుకు గ్రాంటు మంజూరు చేస్తే అప్పులు చేసి కొత్త రోడ్లు వేస్తున్నామన్నారు. పాత పనులు పూర్తి చేస్తేనే కొత్త బిల్లులు ఇస్తామని అధికారులు అనడం ఎంత వరకు ధర్మమో అర్థం కావటం లేదన్నారు. ఇప్పుడు కొత్త పనులు ప్రారంభించి పనులు మొదలు పెట్టి సగం పని చేశామన్నారు. చేసిన పనికి బిల్లులు వస్తే రోడ్డు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ కాంట్రాక్టర్లపై దయతలచి పాత పనుల బకాయిలు చెల్లిస్తే పాత పనులు పూర్తి చేసి కొత్త పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. ఈ పనులపై పంచాయతీ ఏఈ సూరిబాబును వివరణ కోరగా, పాత వర్కుల డిపాజిట్లు కాంట్రాక్టర్లు వచ్చి తీసుకెళ్లడం లేదన్నారు. పాత పనులు ఎక్కువగా నిలిచిపోవటంతో కొత్త పనులు కంప్యూటర్ తీసుకోవటం లేదన్నారు. కొత్త పనులకు కలెక్టర్ అనుమతితతో ఎస్ఎంఆర్‌లు ద్వారా బిల్లులు చెల్లిస్తామన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు వంద శాతం రాయితీ

ఉద్యాన అధికారి చందు జోసఫ్

తోట్లవల్లూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ తోటల సాగును విస్తరింపజేసే లక్ష్యంతో వంద శాతం రాయితీతో రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉద్యాన అధికారి చందు జోసఫ్ సుందరం తెలిపారు. మండలంలోని భద్రిరాజుపాలెం, చాగంటిపాడు గ్రామాల్లో సోమవారం ఆయిల్‌పామ్ తోటల సాగుపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. నీరు నిలవని నల్లరేగడి భూముల్లో ఆయిల్‌పామ్ తోటలను సాగు చేయొచ్చన్నారు. మొక్కలకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని, మెయింటినెన్స్ రాయితీ కింద నాలుగేళ్ల పాటు ఎకరాకు రూ.2,100, పంట దిగుబడి వచ్చే వరకు నాలుగేళ్లపాటు మరో రూ.2,100, 50 శాతం రాయితీపై పనిముట్లు ఇవ్వటంతో పాటు ఉపాధిహామీ కింద ఈ తోటల్లో కూలీలు పనిచేసే అవకాశం కల్పించి రైతులకు లాభం కలిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందని చందు జోసఫ్ వివరించారు.


వ్యవసాయ అధికారుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఏడీఏ ఎన్.రమాదేవి

వరిలో తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించండి

● వ్యవసాయ అధికారులతో ఏడీఏ ఎన్.రమాదేవి

గుడివాడ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో వచ్చే సీజనల్ తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించాలని ఏడీఏ ఎన్.రమాదేవి సూచించారు. సోమవారం ఏడీఏ కార్యాలయంలో పెదపారుపూడి, నందివాడ, గుడివాడ మండలాల వ్యవసాయాధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏఈవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉండాలని, వ్యవసాయ శాఖ అందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని, ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించాలని ఏడీఏ సూచించారు. డీఆర్సీ డీడీఏ కె.జ్యోతిరమణి, డీఆర్సీ ఏడీఏ కె.శ్రీనివాస్, ఏవో డీఆర్సీ బి.పద్మజ, డివిజన్ పరిధిలోని మూడు మండలాల ఎంఏవోలు, వీఏఏలు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో వీవై విష్ణుప్రసాద్ ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పనులపై ప్రతి అధికారికి అవగాహన ఉండాలన్నారు. పంచాయతీల్లో సీసీ రోడ్ల పనులపై గ్రామ పంచాయతీల కార్యదర్శులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

మంత్రి సుభాష్‌కు ఘన స్వాగతం

మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్ర జ్యోతి): మచిలీపట్నం విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు టీడీపీ కార్యాలయం వద్ద మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారా యణరావు తదితరులు ఘన స్వాగతం పలికారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ గజమాల వేసి సత్కరించారు. తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపా లరావు, ఇలియాస్ పాషా స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



దాళ్వాకు అనుమతివ్వాలి: వేదవ్యాస్

మచిలీపట్నం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెడన నియోజకవర్గంలో దాళ్వా పంటకు అనుమతివ్వాలని ప్రభుత్వాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ కోరారు. సోమవారం తన కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. దాళ్వా లేకపోవడం వల్ల పొలాలు చౌడు బారుతున్నాయన్నారు. నియోజకవర్గంలో తీరప్రాంతాలైన బంటుమిల్లి, కృత్తివెన్ను ప్రాంతాల్లో దాళ్వా వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు పంట నష్టపోయారని తెలిపారు.

చీడేపూడిలో ఇసుక క్వారీ వద్దు

● డీటీ శ్రీలతకు వెలివోలు గ్రామస్థుల వినతి

చల్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెలివోలు పంచాయతీ పరిధిలోని చీడేపూడిలో ఇసుక క్వారీకి అనుమతులు ఇవ్వొద్దంటూ గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీలతకు వినతిపత్రం అందించారు. ఉప్పునీటి చొరబాటు కారణంగా పంటలకు ఇబ్బంది ఏర్పడుతుందని, గత ఏడాది బోర్లకు నీరు అందలేదని తెలిపారు. గ్రామస్థులు, రైతాంగ ప్రయో జనాలను దృష్టిలో ఉంచుకుని ఇసుక క్వారీకి అనుమతులు ఇవ్వవద్దని కోరారు. కె.కృష్ణారావు, పి.కృష్ణారావు, పి.రాజారత్నం వినతిపత్రం ఇచ్చారు.

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు


పెదఓగిరాల గ్రామసభలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో, తహసీల్దార్

ఉయ్యూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలను భూ యజమానులు సద్వినియోగం చేసు కోవాలని ఉయ్యూరు ఆర్డీవో బీ ఎస్ హేలాషారోన్ అన్నారు. రీసర్వే భూ సమస్యల పరిష్కారంలో భాగంగా పెదఓగిరాలలో సోమవారం గ్రామ సభ నిర్వహించి భూ యజమానుల నుంచి సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు తహసీల్దార్ సురేశ్ కుమార్ సర్పంచ్ త్రిపురం లక్ష్మి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే శివరామప్రసాద్, ఆర్ఐ యతేంద్రులు, వీఆర్వో పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

కోడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాచవరం గ్రామంలో కోడి పందేల శిబిరంపై ఆదివారం రాత్రి పోలీసులు ఆకస్మిక దాడి నిర్వ హించారు. సిబ్బందితో ఎస్ఐ చాణిక్య దాడి చేసి 11 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 8 మోటార్ సైకిళ్లు, 9 కోడిపుంజులు, 4 కోడి కత్తు లు రూ.16,920 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	254
చికెన్ స్కిన్‌లెస్	264

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.555

డిజిటల్ అరెస్టులపై అప్రమత్తత అవసరం: ఎస్సై చాణక్య

కోడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టులపై మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు సమాధానం ఇవ్వొద్దని ఎస్సై చాణక్య తెలిపారు. పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొద్ది రోజులుగా సైబర్ నేరగాళ్లు అన్‌నోన్ నెంబర్లతో మండలంలోని ప్రజలకు ఫోన్లు చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, దుర్భాష లాడుతున్నారని తెలిపారు. మోసగాళ్లు తాము సీబీఐ, కస్టమ్స్, నార్కోటిక్స్ స్పెషల్ సెల్, ప్రభుత్వ సంస్థల అధికారులమని ఫోన్ చేసి నమ్మిస్తారని, మీపై కేసు నమోదైందని, దర్యాప్తు పేరుతో, వీడియోకాల్‌లో బంధించి భయపెట్టి అధిక మొత్తంలో డబ్బులు కాజేస్తారని తెలిపారు. ఇబ్బందులు కలిగితే 1930కు లేదా పోలీస్ స్టేషన్ నెంబర్ 08671-276333కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

శివోహం

శివాలయాల్లో 'కార్తీక' పూజలు





నాగాయలంకలో రామలింగేశ్వరుడికి విభూదితో అభిషేకం, ప్రత్యేక అలంకరణలో నడకుదురు పృథ్వీశ్వరస్వామి

నాగాయలంక/చల్లపల్లి/పెడన, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా వేకువజాము నుంచే భక్తులు..కృష్ణానదిలో, కాలువల్లో పుణ్యస్నానాలు చేశారు. కార్తీక దీపాలను వెలిగించి నీటిలో వదిలారు. శైవక్షేత్రాల్లో స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. నాగాయలంకలోని శ్రీరామపాద క్షేత్రం పుష్కర ఘాట్ వద్ద ఉన్న రామలింగేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అభిషేకాలు నిర్వహించగా, సాయంత్రం శివలింగానికి విభూదితో అభిషేకం చేశారు. చల్లపల్లిలోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీపురం దుర్గాపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం, పాగోలు పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో వేకువజామున స్వా మికి అభిషేకాలు చేశారు. మహిమాన్విత శైవక్షేత్రం నడకుదురు పృథ్వీశ్వర క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. చల్లపల్లి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి నదీ స్నానమాచరించి స్వామిని దర్శించుకున్నారు. పెడనలోని గంగా పార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కిక్కిరిసి పోయింది. ప్రధాన అర్చకుడు గూడూరు అగస్త్యయ్య నేతృత్వంలో దేవ స్థానంలో ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోనూ, ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.



నాగాయలంకలో కృష్ణానది ఒడ్డున దీపారాధనలు చేస్తున్న మహిళలు

దాళ్వాకు అనుమతివ్వాలి: బూరగడ్డ వేదవ్యాస్

మచిలీపట్నం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెడన నియోజకవర్గంలో దాళ్వా పంటకు అనుమతివ్వాలని ప్రభుత్వాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ కోరారు. సోమవారం తన కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. దాళ్వా లేకపోవడం వల్ల పొలాలు చౌడు బారుతున్నాయన్నారు. నియోజకవర్గంలో తీరప్రాంతాలైన బంటుమిల్లి, కృత్తివెన్ను ప్రాంతాల్లో దాళ్వా వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు పంట నష్టపోయారని తెలిపారు. సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి మంత్రులు కొల్లు రవీంద్ర, ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్‌లు తీసుకుని వెళ్లాని కోరారు. తాగునీటి కోసం రెండుమూడు సార్లు పంటకాలువలకు నీరు వదులుతారని, ఆ నీటిని రైతులు దాళ్వాకు ఉపయోగించుకుంటారని వేదవ్యాస్ తెలిపారు.

చీడేపూడిలో ఇసుక క్వారీ వద్దు

● డీటీ శ్రీలతకు వెలివోలు గ్రామస్థుల వినతి

చల్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెలివోలు పంచాయతీ పరిధిలోని చీడేపూడిలో ఇసుక క్వారీకి అనుమతులు ఇవ్వొద్దంటూ గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీలతకు వినతిపత్రం అందించారు. ఉప్పునీటి చొరబాటు కారణంగా పంటలకు ఇబ్బంది ఏర్పడుతుందని, గత ఏడాది బోర్లకు నీరు అందలేదని తెలిపారు. గ్రామస్థులు, రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇసుక క్వారీకి అనుమతులు ఇవ్వవద్దని కోరారు. కె.కృష్ణారావు, పి.కృష్ణారావు, పి.రాజారత్నం వినతిపత్రం ఇచ్చారు.

పేదల హృదయాల్లో వీఎం రంగాకు సుస్థిర స్థానం

● ఆయన ఆశయాలు నెరవేరుద్దాం: మంత్రి కొల్లు రవీంద్ర



వాడపాలెంలో రంగా విగ్రహావిష్కరణలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర, పక్కన ఎంపీ వల్లభనేని బాలశౌరి, బండి రామకృష్ణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పేదల హృద యాల్లో సుస్థిరస్థానం సంపాదించిన దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా ఆశయాలు నెరవేరుద్దామని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. వాడపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన వంగవీటి రంగా విగ్రహాన్ని సోమవారం మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి ఆవిష్కరించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, మాదివాడ రాము, గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా ప్రభుత్వాస్పత్రిలో మంత్రి రవీంద్ర ఆకస్మిక తనిఖీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం రాత్రి మంత్రి కొల్లు రవీంద్ర ఆకస్మికంగా తనిఖీచేశారు. వైరల్ జ్వరాలు సోకిన రోగులకు వైద్యం సరిగా అందుతోందా లేదా అని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

● టీడీపీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు

అవనిగడ్డ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా ఉంటామని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సోమవారం షాదీఖానాలో పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాటాడారు. నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జి లేకపోవటంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను కార్యకర్తలు సమావేశంలో ప్రస్తావించగా, అధైర్యపడాల్సిన పనిలేదని తెలిపారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా మండల కమిటీలు పరిష్కరిస్తాయని, అక్కడ కాకపోతే తాను నేరుగా వస్తానని తెలిపారు. నియోజకవర్గానికి ఏ సమస్య వచ్చినా మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుకు పరిష్కరించే బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పగించారని తెలిపారు. కర్రా సుధాకర్, యాసం చిట్టిబాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు, మాచవరపు ఆదినారాయణ, బచ్చు రఘునాథ్, బండే కనకదుర్గ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు

చల్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో కలెక్టర్ డీకే బాలాజీని సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కృష్ణాజిల్లాకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధుల కేటాయింపులో భాగంగా చల్లపల్లిలో పారిశుధ్య చర్యలు వేగవంతం చేసేందుకు వెక్టా యంత్రాన్ని రూ.32 లక్షలతో కొనుగోలు చేసి ఇచ్చేందుకు కలెక్టర్ నిర్ణయం తీసుకోవటంపై ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యదర్శి పీవీ మాధవేంద్రరావు ఆమె వెంట ఉన్నారు.



కలెక్టర్ డీకే బాలాజీని సన్మానిస్తున్న చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి

వ్యవసాయానికి పెట్టుబడి సాయం అందించాలి

ఘంటసాల/చల్లపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు డిమాండ్ చేశారు. దేవరకోట సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి కాంతారావుకు, వక్కలగడ్డ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌కు రైతులతో కలిసి ఆయన వినతిపత్రాలు అందించారు. రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తానని కూటమి ఎన్నికలకు ముందు ప్రకటించిందన్నారు. అధికారంలోకి వచ్చాక సహాయం అందించేందుకు ఎందుకు జాప్యం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. రబీ సీజన్‌లో రైతాంగం సాగుచేసే పంటలన్నింటికీ పంటల బీమా సొమ్ము ప్రభుత్వమే భరించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, ఏపీ రైతు సంఘం నాయకుడు హనుమానుల సురేంద్రనాథ్‌బెనర్జి, రైతు నాయకులు హనుమానుల సాయిబాబు, వేమూరి రత్నగిరిరావు, మల్లుపెద్ది లెనిన్ తదితరులు పాల్గొన్నారు.



వక్కలగడ్డ సచివాలయంలో వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నేతలు

విద్యార్థినికి ఆర్థికసాయం

పెడన, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 23వ వార్డుకు చెందిన చేనేత కార్మికుడు పేరక శంకరరావు కుమార్తె సాయిహర్షిత ఇంటర్‌లో 948 మార్కులు సాధించి కళాశాల స్థాయిలో టాపర్‌గా నిలిచి, గుడ్లవల్లేరు కాలేజీలో ఇంజనీరింగ్ చదువుతోంది. పేదరికం వల్ల విద్య కొనసాగించలేని స్థితిలో ఉన్న ఆమెకు ఏఐడబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ చేతుల మీదుగా దేవాంగ సంఘ నాయకుడు కొండపల్లి పరమేశ్వరరావు సోమవారం రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు

ఘంటసాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గోగినేనిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థులకు అవనిగడ్డ ఆర్టీసీ డిపో అందించిన ఉచిత బస్‌పాసులను ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు సోమవారం అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి సుభాష్‌కు ఘన స్వాగతం



మంత్రులు సుభాష్, కొల్లు రవీంద్ర, ఎంపీ బాలశౌరికి గజమాల వేస్తున్న హసీంబేగ్

మచిలీపట్నం టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం విచ్చేసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు టీడీపీ కార్యాలయం వద్ద మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు ఘన స్వాగతం పలికారు. తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ గజమాల వేసి సత్కరించారు. తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, కాగిత వెంకటేశ్వరరావు, కాగిత గోపాలరావు, ఇలియాస్ పాషా పాల్గొన్నారు.



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర పోటీలకు
కప్పలదొడ్డి విద్యార్థులు

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్ అండర్-14 రాష్ట్రస్థాయి పోటీలకు కప్పలదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పి.సాయిసింధు, ఎం.హేమశ్రీ శ్యామల, ఈనెల 6న అన్నమయ్య జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అండర్-17 బాలుర విభాగంలో పి.పవన్, బి.రామన్, వి.విఘ్నేష్‌లు ఎంపికయ్యారు. శిక్షణ ఇచ్చిన పీడీ మురళిని హెచ్‌ఎం ఎం. జ్యోతి, పీఎంసీ చైర్మన్ శివకృష్ణ, అభివృద్ధి కమిటీ సభ్యుడు కట్టా మునీశ్వరరావు, సర్పంచ్ యక్కల మాధవి అభినందించారు.



సునిధి పట్నాయక్‌కు అవార్డు అందజేస్తున్న ఎస్పీ గంగాధర్‌రావు

వ్యాసరచన జిల్లా పోటీల్లో
సునిధికి ప్రథమ స్థానం

నాగాయలంక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలను పోలీసుశాఖ నిర్వహించింది. స్కాలర్స్ హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని సునిధి పట్నాయక్ 'సైబర్‌క్రైమ్ నివారణలో యువత పాత్ర' అన్న అంశంపై మండలస్థాయిలో ప్రథమ, జిల్లాస్థాయి పోటీలోనూ మొదటి స్థానంలో నిలిచింది. సోమవారం ఎస్పీ కార్యాలయంలో సునిధికి ఎస్పీ గంగాధర్‌రావు అవార్డు అందజేశారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

కోడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మంగళవారం ఉదయం 10 గంటలకు కోడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద మత్స్యకారులకు ఐస్ బాక్సుల పంపిణీ, అనంతరం నరసింహాపురం సమీపంలో లింగన్నకోడుపై నిర్మించిన వంతెనను ప్రారంభిస్తారని పేర్కొంది. అధికారులు, కూటమి నాయకులు హాజరుకావాలని కోరింది.

కోడిపందేల శిబిరంపై దాడి

● 11 మంది అరెస్టు, 16,920 స్వాధీనం

కోడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాచవరం గ్రామంలో కోడి పందేల శిబిరంపై ఆదివారం రాత్రి పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. సిబ్బందితో కలిసి ఎస్సై చాణక్య దాడి చేసి 11 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 8 మోటార్ సైకిళ్లు, 9 కోడిపుంజులు, 4 కోడి కత్తులు రూ.16,920 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రహదారుల అభివృద్ధే ధ్యేయం

కోడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు తెలిపారు. రూ.72 లక్షలతో కోడూరు- రామకృష్ణాపురం ప్రధాన రహదారి అభివృద్ధి పనులను సోమవారం స్థానిక కూటమి నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో నియోజకవర్గంలోని రహదారులన్నీ అభివృద్ధిపరుస్తారని తెలిపారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్డు

చల్లపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో భాగంగా గౌడబజారులో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో 203 మీటర్ల మేర సీసీ రహదారి నిర్మాణపు పనులను ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి ప్రారంభించారు. పీఆర్ ఏఈ బి.శ్రీనివాసరావు, కార్యదర్శి పీవీ మాధవేంద్రరావు పాల్గొన్నారు.

ముళ్ల చెట్ల తొలగింపు

ఘంటసాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ సొంత ఖర్చులతో రహదారి కిరువైపులా పెరిగిపోయిన ముళ్లచెట్లను తొలగించే పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఘంటసాల శివారులోని గృహనిర్మాణ శాఖ గోడౌన్ సమీపం నుంచి మల్లాయి చిట్టూరు వెళ్లే ప్రధాన రహదారిలో 2 కిలోమీటర్ల మేర యంత్రసాయంతో జంగిల్ క్లియరెన్స్ పనులను ఉప సర్పంచ్ అయినపూడి భానుప్రకాష్, పరిశె చలపతి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రూ.లక్ష ఖర్చు అవుతుందని తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

నాగాయలంక, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): బొండాడ గ్రూపు (హైదరాబాద్) ఆర్థిక సౌజన్యంతో సుదర్శి మానవతా సేవా సంస్థ సహకారంతో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం నందు 55 ఏళ్లు దాటిన వారికి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తు న్నట్టు సుదర్శి సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్, బొండాడ గ్రూపు ప్రతినిధి వంగర శేషగిరిరావు తెలిపారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేస్తారని తెలిపారు.